ఎడారిలో ప్రాణగండం!

శ్యాంబాబు

ముగ్గురు కస్టమ్స్ అధికారులు, మరో ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ ఆఫీసరు ప్రయాణీకుల్ని వారి సామానులనీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

దేశాయ్ తన బ్రీఫ్ కేస్ తాళం తెరచి టేబిల్ మీద పెట్టాడు. రెండు షర్ట్లు, పాంటు, అండర్ వేర్, బనియన్స్, షేవింగ్ కిట్, టూత్ బ్రష్, పేస్ట్, 20 ఉత్తరాలు, టైప్ చేసిన కాగితాలున్న ఫైలు, బ్రీఫ్ కేస్ లైనింగ్‌ను, అడుగుభాగాన్ని జాగ్రత్తగా చూసిన తరువాత మూత వేశారు.

"కెమెరా ప్లీజ్!" —

కెమెరాను ఇచ్చాడు. మినోల్టా ఎ. ఫైవ్. ఖరీదై

కెమెరా.

"ఈజిట్ లోడెడ్" అడిగాడు సెక్యూరిటీ ఆఫీసరు.

"నో. ఎంప్టీ!" అన్నాడు దేశాయ్ నవ్వుతూ.

కెమెరా ఓపెన్ చేసి, లోపల ఓసారి పరీక్షగా చూసి మళ్ళీ మూసేసి బల్లమీద పెట్టారు.

"ప్లీజ్ స్టెప్ ఆన్ దిస్ మిషిన్ ప్లీజ్" అన్నాడో కస్టమ్స్ అధికారి.

దేశాయ్ పరీక్షగా ఆ మిషిన్ వైపు చూశాడు.

బరువు చూసుకొనే యంత్రంలావుంది. అడుగు బేస్‌కు ఎటాచ్ చేసి అటూ ఇటూ రెండు మెటల్ బార్స్ వున్నాయి. ఎలక్ట్రానిక్ చెక్కర్. శరీరంమీద ఏ రకమైన లోహమున్నా వెంటనే అలారం మోగిస్తుంది ఆ యంత్రం. పిస్తోళ్ళు, కత్తులు, బంగారం ఎలాంటి లోహాన్నయినా, ఎంత చిన్న మొత్తంలో వంటిమీద ఉన్నా పసిగడు తుంది.

"ఇదివరకు ఇంత సివియర్ చెక్కింగ్ లేదు" అన్నాడు దేశాయ్ మిషన్‌మధ్య నిలబడుతూ.

"అవును. ఇప్పుడు విమానాల హైజాకింగ్ వల్ల కట్టు దిట్టాలు ఎక్కువచేశారు" చెప్పాడు ఓ అధికారి.

వెంటనే 'బజ్ జ్' మంటూ ఆగకుండా అలారం మోగడం మొదలెట్టింది. సెక్యూరిటీ ఆఫీసరు స్విచ్ ఆఫ్ చేశాడు.

"చేతి గడియారం, ఫౌంటెన్ పెన్, తాళాలగుత్తి, చిల్లర డబ్బులు బయటపెట్టండి" అన్నాడు అర్థంచేసు కొన్నట్లు.

మినూ దేశాయ్ విసుగ్గా అతనివంక చూశాడు.

"సారీ! ఇన్‌స్ట్రక్షన్స్! ప్లీజ్ కోపరేట్ విత‌జ్!" అన్నాడు అపోలజిటిక్‌గా.

దేశాయ్ చిత్రంగా భుజాలెగరేసి, "ఆల్ రైట్" అన్నాడు గడియారం మొదలైనవి తీసి బల్లమీద పెడుతూ. సెక్యూరిటీ ఆఫీసరు మళ్ళీ స్విచ్ ఆన్ చేశాడు. ఈసారి ఏవిధమైన శబ్దం రాలేదు.

"ఓ. కె. సర్. థాంక్యూ!"

దేశాయ్ సన్నగా నవ్వి తన వస్తువులు తీసుకొని విమానంవైపు నడిచాడు.

ఫోకర్ ఫ్రెండ్‌షిప్ విమానం, ఇండియన్ ఎయిర్ లైన్స్ కలర్స్ తో ఒంటిమీద పెయింట్ చేసుకొని రన్ వే మీద దర్జాగా నిలబడివుంది. 'ఇండియన్ ఆయిల్' వాళ్ళ ట్రక్కు పెట్రోల్ నింపుతోంది.

విమానంవైపు నడుస్తూ తల తిప్పి కస్టమ్స్ బారియర్ వైపు మళ్ళీ చూశాడు.

తన మిత్రుడు జైస్వాల్ కూడా తను చేసిన డ్రిల్లే మళ్ళీ చేస్తున్నాడు.

మెట్లెక్కి విమానంలోకి వెళ్ళాడు. పనసపండులాంటి ఎయిర్ హోస్టెస్ చిరునవ్వులు చిందిస్తూ స్వాగతం పలికింది. చేతిలో బ్రీఫ్ కేసు 'స్టివర్డ్'కు ఇచ్చి ముందుకు కదిలాడు.

ముందువరసలో కిటికీ ప్రక్కగావున్న సీట్లో కూర్చొన్నాడు.

జైస్వాల్ కూడా అప్పుడే లోపలికివచ్చి చివరి వరుసలో కూర్చొన్నాడు.

వెనక్కి జేరగిలబడి సిగరెట్ వెలిగించాడు దేశాయ్. సీట్ కంపార్ట్‌మెంట్‌లోవున్న రాక్‌లోనుండి 'లైఫ్' మాగజైన్ తీసి పేజీలు త్రిప్పసాగాడు.

ఏడూ అయిదయింది.

ఎయిర్ హోస్టెస్ ముందువరస దగ్గరకొచ్చి పబ్లిక్

అడ్రస్ సిస్టమ్ ఆన్ చేసింది. చేతిలో స్పీకర్ పట్టుకొని ఒక్కసారి అందరివంకా నవ్వుతూ చూసింది.

"లేడీస్ అండ్ జంటిల్ మెన్! వెల్ కం ఎబ్రాడ్ ది ఇండియన్ ఏర్ లైన్స్ ఫోకర్ ఫ్రెండ్షిప్, వియార్ గోయింగ్ టు టేకాఫ్ ఇన్ ఎ ఫ్యూ మినిట్స్. మీన్ వైల్ ఐవిల్ ఎక్స్ ప్లెయిన్...."

ఎయిర్ హోస్టెస్ కంఠం మధురంగా ఆక్సిజన్ మాస్క్ లను ఎమర్జన్సీలో ఎలా ఉపయోగించాలో చెప్పుకు పోతోంది.

దేశాయ్ కిదేం క్రొత్తకాదు. సీటు బెల్టు కట్టుకొని, సిగరెట్ ఆర్పేసి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

రన్ వే వదిలి విమానం ఆకాశంలోకి ఎగబ్రాకుతోంది. ఇంజన్ చప్పుడులో చిత్రమైన మార్పులువింటూ కూర్చొన్నాడు. విమానం లెవల్ గా ఎగరడం మొదలవగానే సీట్ బెల్ట్ విప్పేసి, సిగరెట్ వెలిగించాడు.

పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ జుంమ్మంటూ మ్రోగింది. మైక్ లో విమానం కెప్టెన్ గొంతు వినిపించింది.

"గుడ్ ఈవెనింగ్ ఫ్లోక్స్! దిసీజ్ యువర్ కెప్టెన్ మాన్ సింగ్ స్పీకింగ్. భూమికి దాదాపు పదెనిమిది వేల అడుగుల ఎత్తులో గంటకు రెండువందల డెభ్భైమైళ్ళ వేగంతో మనం ప్రయాణం చేస్తున్నాము. వాతావరణం దారంట బాగానే వున్నట్లు వెదర్ రిపోర్ట్స్ చెపుతున్నాయి. బహుశా తొమ్మిదింపావు ప్రాంతంలో మనం బొంబే శాంతక్రుజ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో దిగుతాము. ఎంజాయ్ ది ఫ్లయిట్ అండ్ థాంక్యూ!"_

మైక్ లో కెప్టెన్ గొంతు ఆగిపోగానే టైమ్ చూసుకొన్నాడు దేశాయ్. ఏడు ఇరవై అయింది. లేచి నిలబడి 'లేవెటరి' వైపు నడిచాడు.

లోపలకు వెళ్ళగానే తలుపుమూసి బోల్ట్ పెట్టాడు. ప్యాంట్ ఫోల్డ్ లోనుండి చిన్న ప్లాస్టిక్ కవరు బయటికి తీశాడు. దాంట్లో ఎర్రటి కేప్సిల్స్ మూడు, పచ్చని క్యాప్సిల్ ఒకటి వున్నాయి.

కవరుచింపి నాలుగింటిని అరచేతిలో పెట్టుకొని వాటి వంకే క్షణం చూస్తూ వుండిపోయాడు.

ఎర్రని కాప్సిల్స్ పేరు డిక్లోరోక్లోరోసెక్లిన్. లేటెస్ట్ ఇన్వెన్షన్. ఆ కాప్సిల్ లోపలి పౌడర్ కలిసిన గాలి పీల్చిన మనుషులు క్షణాలమీద స్పృహకోల్పోతారు. రైల్వే కంపార్ట్మెంట్ అంత ఏరియాను కలుషితం చెయ్యడానికి ఒక్క కాప్సిల్ చాలు.

పచ్చ కాప్సిల్ దానికి విరుగుడు.

పచ్చ కాప్సిల్ జేబురుమాలు మధ్యలో పెట్టి జాగ్రత్తగా మడతవేశాడు. రెడ్ కాప్సిల్స్‌ను పైజేబులో వేసుకొన్నాడు. మరో జేబులోనుండి నీలి లిట్మస్ పేపరు తీసి గడియారం చైన్ మధ్య ఇరికించాడు.

తిరిగివచ్చి సీట్లో కూర్చొన్నాడు.

ఎయిర్ హోస్టెస్ అందరికీ 'డిన్నర్' సర్వ్ చేస్తోంది. ఆమ్లెట్ అండ్ టోస్ట్, విస్కీ ఆన్ రాక్స్ తెమ్మని చెప్పాడు.

ఈ ఫ్లయిట్ లో తక్కువ మంది వున్నట్టున్నారు. అంతవరకూ కొంతశ్రమ తగ్గింది అనుకొన్నాడు దేశాయ్. దాదాపు ఇరవై నిముషాల్లో అందరూ డిన్నర్ ముగించారు.

టైమ్ అయిదు నిముషాలక్కువ ఎనిమిది కావస్తోంది. రీడింగ్ లాంప్స్ తప్ప డూమ్ లైట్స్ వెలగడం లేదు.

దేశాయ్ లేచి నిలబడ్డాడు.

సీటు పైభాగంనుండి అంతా చీకటిగావుంది. ఎవరికీ ముఖం గుర్తుతెలిసే అవకాశం లేదు.

జేబురుమాలు బయటికితీసి పచ్చ కాప్సిల్ దగ్గర గట్టిగా నొక్కి ముక్కుదగ్గర పెట్టుకొని, రెడ్ కాప్సిల్ రెండవచేతిలో వేళ్ళమధ్య గట్టిగా నలిపాడు. కాప్సిల్స్ క్లిక్ అనగానే ఉఫ్‌మంటూ గాలిలోకి పౌడర్ని ఊదాడు.

పైన తిరుగుతున్న బ్లోయింగ్ ఫేన్ వల్ల ఆ హాలులో పౌడరు క్షణాలమీద విమానం బాడీ అంతా వ్యాపిస్తుందని తెలుసు.

కర్చీఫ్‌ను ముక్కుకు అడ్డంపెట్టుకొని, వాచ్ చైన్ క్రిందవున్న లిట్మస్ పేపర్‌నే చూస్తున్నాడు. నీలి లిట్మస్ రంగు క్షణాల్లో ఎరుపుగా మారింది.

'గుడ్! వెరీ ఎఫెక్టివ్!' అనుకొన్నాడు ఆనందంగా.

కళ్ళు మండుతున్నాయి. ముఖంలో చిరాకు కలిగిస్తోన్న వాసన. రెండు నిముషాలు అలానే జేబురుమాల్లో పౌడరువాసన చూస్తూ గడిపాడు.

జైస్వాల్ నవ్వుతూ ముందుకు నడిచి వచ్చాడు.

"ఎవిరిథింక్ యీజ్ ఓ. కె! ఎయిర్ హోస్టెస్‌తో సహా అందరూ స్పృహతప్పిపడివున్నారు"—అన్నాడు కళ్ళవెంట కారుతున్న నీరు తుడుచుకొంటూ.

దేశాయ్ తల వూపాడు. "ప్రెటీ గుడ్ స్టఫ్! లెటజ్ మూవ్!"—అన్నాడు పైలట్ కాబిన్ వైపు నడుస్తూ.

కాబిన్ తలుపు తెరిచి జైస్వాల్ లోపలకు అడుగు పెట్టాడు. అతని వెనుకే దేశాయ్ లోపలకు నడిచాడు.

"వాట్ ద హెల్" అంతే! పైలట్ ఒక్కక్షణం తల విదిలించి అలాగే కంట్రోల్ స్టిక్ మీద ముందుకు వరిగాడు. కో పైలెట్ అదేస్థితిలో ఉన్నాడు.

కంట్రోల్ తప్పి విమానం డైవింగ్ పొజిషన్‌లోకి వచ్చింది.

విమానం అటూ ఇటూ ఊగుతూ పోతోంది. పైలట్‌ను పక్కకు కులాగాడు దేశాయ్. సీట్లో కూర్చొని కంట్రోల్ స్టిక్ చేతికి తీసుకొన్నాడు.

2

నాకు చటుక్కున మెలకువ వచ్చింది. దేనికి? ఒక్క క్షణం కళ్ళు తెరచి చూశాను.

జూయ్‌మంటూ ఎక్కడో దూరాన ఇంజన్ చప్పుడు వినిపిస్తోంది.

ఆ శబ్దం దగరవుతోంది. క్షణక్షణానికి దగ్గరవుతున్నట్లు శబ్దం పెరుగుతోంది.

మై గాడ్! ఎయిర్‌ప్లేన్! జోధ్‌పూర్ నుండి రావల సిన సప్లయిలు, వారంక్రితం రావలసినవి, ఇసుకతుఫాను కారణంగా రాలేదు.

మంచంమీదినుండి దిగి నైట్ డ్రస్‌మీదే చకచకా 'ఓవరాల్' తొడుక్కున్నాను. గ్లోవ్స్ తొడుక్కుని, యాంకిల్ బూట్ తొడుక్కొని, టార్చి తీసుకొని బయటి కారిడార్లోకి నడిచాను.

కారిడార్ చివర ప్రొజక్షన్ దగ్గర నిలబడి ఆకాశం లోకి చూస్తున్నాడు షేర్‌ఖాన్.

బలంగా వీచే గాలివెంట ఇసుక కణాలు రాకెట్లలా దూసుకువస్తున్నాయి. జేబులోనుండి 'విండ్ షీటర్' గాగుల్స్ తొడుక్కొని అతనివైపు నడిచాను.

గాగుల్స్, ఓవరాల్ రెండూ లేకుండా ఈ ఎడారి ఇసుకలో జీవించడం కష్టం.

నిశ్శబ్దంగా వెళ్ళి షేర్‌ఖాన్ ప్రక్కనే నిలబడ్డాను.

విమానం దగ్గరగా ఎగురుతున్న శబ్దం వినిపిస్తోంది. ఎంత దూరంలో వున్నదీ ఆ ఇసుక లో కనిపించడం లేదు.

ఈ ఇసుక తుఫానులో 'సప్లయిస్' డ్రాప్ చెయ్యడానికి ప్లేన్‌ను ఎలా అనుమతించారో అర్థం కావడం లేదు.

మేఘంలావున్న ఇసుకమధ్యలోంచి ఎర్రగా, పచ్చగా రొటేట్ అవుతోన్న లైట్లు కనిపిస్తున్నాయి. గాలి రొదతోపాటు విమానశబ్దం హెచ్చుగా వినిపిస్తోంది.

"మైగాడ్! హి యీజ్ గోయింగ్ టు లాండ్!" అరిచాను. అవును ఆ రొటేటింగ్ లాండింగ్ లైట్లకు అర్థం అదే.

"అవును! కానీ అది మన సప్లయిస్ విమానంకాదు. ఈ తుఫానులో దారితప్పిన ఏ కమర్షియల్ ఎయిర్ లైనరో అయివుండాలి"—అన్నాడు షేర్‌ఖాన్.

విమానం బేరక్స్ మీదుగా, మా తలమీద ఎగిరి వెళ్ళినట్లు అనిపించింది. క్రమక్రమంగా మళ్ళీ శబ్దం దూరం అవుతోంది.

"క్రాష్‌లాండింగ్ చెయ్యడానికి సరైనచోటు చూస్తున్నట్లుంది... ఈ ఇసుక తుఫానులో పైలట్‌కు ఏం కనిపిస్తుంది?"—నాకు ఓవరాల్ లోపల చేతులకు చెమట పడుతోంది.

ఎటుచూసినా ఇసుకగుట్టలు. సమతలమైన ప్రదేశం అంటూ లేదు. ఆ వేగంలో ఎంత జాగ్రత్తగా దించినా ప్రమాదం తప్పదు. అప్పుడు గుర్తొచ్చింది నా రెస్పాన్సిబిలిటీ. మానవుడిగా నా కర్తవ్యం!

"షేర్‌ఖాన్! వెంటనే డాక్టర్ ఘోష్‌ను లేపు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను, వీలయినన్ని ఓవరాల్స్‌ను తీసుకురా... చూస్తోంటే దగ్గరలోనే లాండింగ్ చేసేట్లున్నారు"—అరిచాను.

నా గొంతులో ఆత్రుతను షేర్ ఖాన్ అర్థం చేసుకొన్న వాడిలా "ఓ.హాం సాబ్"— అని క్వార్టర్స్‌లోకి పరిగెత్తాడు...

విమానం శబ్దం మళ్ళీ దగ్గరయింది.

ఎర్రనిపచ్చని రొటేటింగ్ లాండింగ్ దీపాలుస్పష్టంగా కనిపిస్తోన్నాయ్. వాటితోపాటు తెల్లని కాంతి చిమ్మే హెడ్ లైట్స్ వెలిగించాడు పైలట్.

ఆ వెలుతుర్నిబట్టి భూమికి దాదాపు వంద అడుగుల ఎత్తునవుంది విమానం... హెడ్ లైట్ వెలుతురులో ఎగిరే ఇసుక మేఘంలా కనిపిస్తోంది. అలా ఎంతోసేపు ఎగురుతూ ఉండలేదు. ఈ ఇసుకంతా ఇంజన్‌లోకి దూరి ఈ పాటికి వాటిని పాడుచేసివుండాలి...

లాండింగ్ వీల్స్ ఇంకా బయటకు రాలేదు...చక్రాల మీద విమానాన్ని ఈ ఇసుకలో దింపడం అవివేకం... పైలెట్ చాలా తెలివిగలవాడు, ధైర్యవంతుడు అయివుండాలి...'బెల్లీ లాండింగ్' చేస్తాడనుకొంటూను.

అవును... ఈ పరిస్థితులలో చక్రాలు లేకుండా విమానాన్ని దింపడమే మంచిది. ఇసుక కాబట్టి, క్రిందవుండే పెట్రోలుటాంకు పగిలి నిప్పంటుకునే ప్రమాదంలేదు.

ఉన్నట్టుండి విమానం రొద ఆగిపోయింది.

మేము ముగ్గురం విమానం పడిపోయినవైపు పరుగెత్తాము.

3

రాజస్థాన్ ఎడారి! ది గ్రేట్ ఇండియన్ డెసర్ట్ అని పిలుస్తూవుంటారు భూగర్భ శాస్త్రవేత్తలు.

ఆ ఎడారి మధ్యలో జీవాణువుల అభివృద్ధి, పరిశీలన భూగర్భ పరిశోధన జేయడానికి భారత ప్రభుత్వం తర

పున ఓ పనిముంచి భూగర్భశాస్త్రజ్ఞులం ఇక్కడ పరిశోధనలు చేస్తున్నాం.

ఈ ప్రాంతమంతా ఇసుక ఎడారి. ఏరకమైన కాలిబాటలుగాని, ఆకాశ మార్గాలుగాని ఈ ప్రాంతానికి దగ్గరలో లేవు.

ప్రతి బుధవారం జోధ్‌పూర్ మిలటరీ ఎయిరోడ్రోమ్ నుండి ఒక విమానంవచ్చి మాకు ఓ వారానికి సరిపడే ఆహార పదార్థాలు పారాషూట్లద్వారా పడేసి వెళ్ళిపోతుంటుంది.

ఎండా కాలంలో విపరీతమైన వేడి, శీతాకాలంలో అతిచల్లదనం ఈ ప్రాంతపు శీతోష్ణస్థితి లక్షణాలు.

వేసవి మొదలయేముందు బ్రహ్మాండమైన గాలితో ఇసుకతుఫానులు రావడం మామూలే.

ఏప్రిల్ నెల మామూలుగా ఈ ప్రదేశంగుండా ఏ రకమైన విమానాలు ప్రయాణం చెయ్యవు.

విమానం కూలినవైపు ఓ పదిగజాలు పరిగెత్తి చటుక్కున ఆగిపోయాను. "స్టాప్ ది రన్" — అరిచాను మెదడులో చటుక్కున ఏదో గుర్తొచ్చి.

షేర్‌ఖాన్, డాక్టర్ ఘోష్, నా వెనకే ఆగిపోయారు.

నేను వెనక్కి తిరిగి బారెక్స్‌లోకి పరిగెత్తాను. స్టోర్ రూమ్‌లోనుండి నాలుగు నైలాన్ తాడు చుట్టలుతీసుకొని బయటికి వచ్చాను.

ఒక తాడు కొసను బారెక్స్ వరండా స్తంభానికి బిగించాను. మిగిలినది చేత్తో పట్టుకుని మళ్ళీ వాళ్ళిద్దరి దగ్గరకు చేరుకొన్నాను.

ఈ ఎడారి ఇసుకలో ఒకసారి దారితప్పితే 'కంపాస్' సహాయం లేకుండా రాత్రిళ్ళు దారి కనుక్కోవడం దుర్లభం. విమానం వెతికే ప్రయత్నంలో దారితప్పితే, ఆ

ఇసుక గుట్టల్లో మేము కప్పడిపోవడం ఖాయం.

అంచేతే మౌంటినీరింగ్ చేసే వాళ్ళలా తాడు సహాయంతో ముందుకు వెళ్ళడానికి నిశ్చయించాను.

నడుస్తోంటే ఇసుకలో అడుగులు కూరుకుపోతున్నాయి.

తాడు ఒక్కొక్క చుట్టూ వదలిపెడుతూ విమానంవైపు గబగబ నడుస్తున్నాము. ఒక తాడు అయిపోగానే దాని చివరకు రెండవ చుట్టను బిగించి మళ్ళీ నడవడం మొదలు పెట్టాను.

ఒక్కొక్క రోప్ కాయిల్ పొడవు వందగజాలు. అంతా బారెక్స్‌నుండి దాదాపు వందగజాలు వచ్చామన్నమాట.

షేర్‌ఖాన్ నడుస్తూ చేతిలో ఫ్లాష్‌లైటు అర్ధచంద్రాకారంలో వెలుగును త్రిప్పుతున్నాడు.

మూడవ కాయిల్ కూడా ముడివేశాము. కాస్తదూరం నడవగానే గాలిలో చిత్రమైన శబ్దం మార్పువచ్చింది. విమానం అల్యూమినియం రేకుమీద ఇసుక పడుతోన్న శబ్దం.

ముగ్గురం ఒక్కక్షణం కదలకుండా నిలబడిపోయాం.

ఫ్లాష్ లైట్ వెలుగులో విమానం తోకభాగం కనిపిస్తోంది.

భారత త్రివర్ణ పతాకం, దాని క్రిందే 'ఐ ఎ' అని పెయింట్ చేసిన ఎర్రని అక్షరాలు కనిపిస్తున్నాయి.

విమానం చుట్టూ గాలి అప్పుడే ఇసుకను గుట్టలు, గుట్టలుగా పోస్తోంది.

ఫ్లాష్‌లైట్ కాంతిని ప్రక్కకు తిప్పాడు. విమానం కిటికీలు, ఒక రెక్క కనిపిస్తున్నాయి.

కిటికీల అద్దాల లోపలనుండి సన్నని వెలుతురు కని

పిస్తోంది. ఏమాత్రం లోపల కదలిక వున్నట్లు లేదు.

షేర్‌ఖాన్ చకచకా విమానం చుట్టూ ప్రదక్షిణ చేసి వచ్చాడు.

“కాంబిన్‌లో ఎవరో కదుల్తున్నట్టుంది సాబ్!”— అన్నాడు తిరిగివస్తూ.

బహుశా విమానంలో పైలట్, క్రూ, తప్ప ఎవరూ లేరేమో. అందుకనే బహుశా లోపల ఏమీ అలికిడి లేదనుకొంటాను.

అంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ విమానానికి ప్రమాదం కలక్కుండా బెల్లీలాండింగ్ చేసిన పైలట్ నిపుణత్వాన్ని అభినందించకుండా వుండలేకపోయాను.

ముగ్గురం విమానం ముందువైపుకు నడిచాము.

కాక్‌పిట్‌లో కదలిక లేదు. బలంగా వీచే గాలికి ఇసుక తెరలు తెరలుగా విండ్‌షీల్డ్ అద్దాలమీద పడుతోంది.

షేర్‌ఖాన్ ఫ్లాష్‌లైటు కాంతి అద్దాలమీద పడేట్టు వేశాడు.

కాబిన్ లోపల ఎవరిదో తలమాత్రం కనిపిస్తోంది. బహుశా పైలట్ ఏమో?

లైటు ఆర్పి, మళ్ళీ వెలిగించాడు. అలా నాలుగైదు సార్లు లైటు ఆర్పుతూ వెలిగిస్తూ అద్దాలమీద వెలుతురు ప్రసరించేట్టు వేశాడు. లోపలవున్న వాళ్ళకు అలా చేయడంవలన, బయట మనుషులున్నట్లు తెలుస్తుందని.

లోపల ఏమాత్రం కదలికలేదు. నేను షేర్‌ఖాన్ వైపు చూశాను. షేర్‌ఖాన్ మళ్ళీ ఓసారి లైటు వెలిగించి, ఆర్పేసి విసుగ్గా తలాడించాడు.

“ఇందాక నేను చూసినప్పుడు కాబిన్‌లో ఎవరో తిరుగుతున్నట్లు ఆ అద్దాల్లోంచి కనిపించింది”—అన్నాడు షేర్‌ఖాన్.

"బహుశా స్ట్రయిక్ వల్ల స్పృహతప్పి పడిపోవడం జరిగుండాలి. తలుపు తెరిచే ప్రయత్నం చెయ్యడం మంచిది" అన్నాను మళ్ళీ విమానం ప్రక్కకు నడుస్తూ.

విమానం ఎంట్రెన్స్ డోర్ విమానంలో ఓ భాగంగా అతుక్కుని బాడీలో కలిసిపోయివుంది. బయటినుండి ఎలా తెరవాలో అర్థంకా లేదు.

షేర్‌ఖాన్ ఒక్కసారి డోర్ చుట్టూ చూసి లాభం లేదన్నట్లు తలాడించాడు.

"కిటికీ అద్దాలు పగలగొడితే మంచిదేమో"—అన్నాడు డాక్టర్ ఘోష్.

షేర్‌ఖాన్ చేతిలోవున్న 'పిక్‌యాక్స్'తో అద్దంమీద బలంగా రెండుసార్లు కొట్టాడు. అవి చెక్కు చెదర కుండా వున్నాయి. కనీసం ఒక్క బీటుకూడా పడ లేదు.

"నో. లాభంలేదు. విమానం ప్రెషర్ ప్రూఫ్. అనేక వేల పౌండ్ల వత్తిడిగల గాలికి తట్టుకోనేశక్తిగలవి ఆ అద్దాలు. మామూలు పరికరాల్తో పగలగొట్టడం కుదరదు" అన్నాడు నిస్పృహగా.

డాక్టర్ ఘోష్ చటుక్కున నా చెయ్యినొక్కాడు "సురేష్ సీవట్!" అన్నాడు ఓ కిటికీవైపు చూపెడుతూ.

కిటికీ ప్రక్క సీట్లోంచి ఎవరో లేచి నిలబడ్డారు. ముఖం సరిగ్గా కనిపించడం లేదు.

షేర్‌ఖాన్ 'పిక్కాక్స్'తో కిటికీమీద కొట్టాడు. ఆ వ్యక్తి కిటికీలోంచి బయటకు చూశాడు. బయట చీకటిగా వుండడంవలన అతనికి మేం కనిపించము. అందుకే షేర్‌ఖాన్ మీద పడేట్లు టార్చి వేశాను నేను.

అతను కదలిక లేకుండా కిటికీలోనుండి మావంకే చూస్తూ వుండిపోయాడు.

"చూడండి! ఇంకా లోపల చాలామంది వున్నారు" అరిచాడు డాక్టర్ ఘోష్.

కిటికీలోనుండి లోపల అనేకమంది వున్నట్లు సన్నని నీడలు కనిపిస్తున్నాయి.

"మైగాడ్! విమానం కూలినప్పుడు వత్తిడికి వాళ్ళంతా స్పృహతప్పి పడివుండాలి" అన్నాను.

కిటికీలోనుండి షేర్‌ఖాన్ వైపు చూస్తున్న తను తలుపు వైపు సైగ చేశాడు.

లోపలంతా కంగారుగా అటూ ఇటూ తిరుగుతున్నట్లు కిటికీ అద్దాలమీద నీడలు కదులుతున్నాయి. లోపలవున్న వాళ్ళ ఆందోళన, ఆదుర్దా అర్థంచేసుకోగలను. కొద్ది క్షణాల్లో చావబోతున్నామని తెలిసి, మానసికంగా ఆ ఆలోచనకు అలవాటు పడేలోపలే స్పృహపోయి, మేలుకొనేప్పటికి ఇంకా బ్రతికే వున్నట్లు తెలుసుకోవడం, కొన్ని క్షణాలు విచక్షణా జ్ఞానాన్ని, ఆలోచనను పని చెయ్యనివ్వదు.

ముగ్గురం విమానం తలుపు వైపు పరిగెత్తాం.

లోపల గడ తెరిచినా బలంగా వీస్తున్న గాలివలన తలుపుతీయడం చాలా కష్టమైంది. తలుపు తెరవగానే తెల్లని వెలుతురు మామీద పడింది. తలుపు తెరిచిన వ్యక్తి గాలివిసురుకు ఒక్క క్షణం వెనక్కి తూలాడు.

గబగబా విమానంలోకి ఎక్కాం.

తెరిచిన తలుపులోనుండి ఇసుక జల్లులు జల్లులుగా వర్షంలా విమానం లోపలికి పడుతోంది. మేం లోపలకు ఎక్కగానే ఒక్క క్షణం అంతా నిశ్శబ్దమేర్పడింది.

"ఈజీ మైడియర్ ఫ్రెండ్స్! టేకిట్ యీజీ!"_ అన్నాను అందరివైపూ చూస్తూ.

డాక్టర్ ఘోష్, షేర్‌ఖాన్ నా వెనకే వాళ్ళు తెచ్చిన

సామగ్రితో నిలబడ్డారు. ఈ ఎడారి దుమ్ములో మమ్మల్ని చూసిన ఏ సామాన్య మానవుడైనా ఒక్క క్షణం అవాక్కవడం సహజం. కళ్ళకు కాపుదలగా పెట్టుకొన్న గాగుల్స్ తీసేసి అందరివైపూ నవ్వుతూ చూశాను.

"హౌ డు హెల్ ఆర్ యూ?" అన్నాడో ముసలాయన సీట్లమధ్యనుండి లేచి నిలబడుతూ.

"ఇదే ఎయిర్ పోర్ట్? బొంబే వెళ్ళడానికి ఇంకెంత సేపు పడుతుంది?"—ఆతృతగా అడుగుతున్నాడో ముందు సీట్లో మనిషి.

"మై గుడ్ నెస్! మీరెవరో దొంగల్లావున్నారు" అరిచింది ఒకావిడ కీచుగొంతులో.

ఒక్కసారి అందరూ అన్నిరకాలుగా ప్రశ్నించడం, జవాబులు చెప్పడం, మాట్లాడ్డం చేసేస్తున్నారు.

"స్టాపిట్! యూ ఫూల్స్!" అరిచాను ఒక్కసారి కోపంలో.

"మీరెంత ప్రమాదంలో వున్నదీ అర్థంకాలేదనుకొంటాను మీకు. మీరిప్పుడు వున్నది రాజస్థాన్ ఎడారిలో. ఓ, ఇరవై నిముషాల క్రితం మీ విమానం ఇక్కడ కూలిపోయింది. మరో అరగంట మీరంతా ఇలాగేవుంటే ఇక్కడి ఇసుకతుఫానులో, ఇసుకగుట్టల్లో సమాధి అవుతారు."

అందరూ ఒక్కసారిగా అదిరిపోయారు. నే చెప్పింది నమ్మలేనట్లు అందరూ నావంక చూస్తూ వుండిపోయారు గుడ్లప్పగించి.

"నా! పైలట్ ఏడి?"—అన్నాను వాళ్ళందరి వంకా చూస్తూ.

"ఎయిర్ హోస్టెస్ కూడా కనిపించడం లేదు"—

అన్నాడు డాక్టర్ ఘోష్.

వాళ్ళందరినీ మా స్థావరానికి తీసుకెళ్ళడానికి సిద్ధం చెయ్యమని చెప్పి, నేను పైలెట్ కాబిన్‌లోకి నడిచాను. తలుపు తెరచుకొని లోపలకు వెళ్ళాను.

విమానం కెప్టెన్ కంట్రోల్ స్టిక్ మీద తల ఆనించి ముందుకు పడివున్నాడు. అతనిలో ప్రాణంలేదని ఆ విచిత్రమైన భంగిమ చూడగానే అర్థమయింది. కో పైలట్ కూడా అదేసితిలో వున్నాడు.

విమానం బెల్లీలాండింగ్ చేసినప్పుడు వత్తిడి అంతా ముందుభాగం తీసుకొంటుంది.

ఆ వత్తిడికి చనిపోయివుండాలి.

కాబిన్‌లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా అటూ ఇటూ పడిపోయివున్నాయి.

కో-పైలట్ చెయ్యి పట్టుకొన్నాను. ప్రాణంలేదని తెలుస్తోంది. వెనక్కి తిరిగి వెళ్ళబోయి ఆగిపోయాను. బూటుకు ఏదో జిగురుగా అంటుకొన్నట్లనిపించింది. క్రిందకివంగి చూశాను. ఏదో నల్లటి ఆయిల్ ఒకప్రక్క చిన్న మడుగులావుంది. చటుక్కున టార్చి వెలిగించి అటు వేశాను.

రక్తం! ఎర్రని, చిక్కని రక్తం!

క్రాష్‌లాండింగ్‌లో ఏ ఊచో, గెరో పైలట్ శరీరంలోకి గుచ్చుకొని వుండాలి. అద్దాలమీద ఇసుక జల్లుగా పడుతూ చిత్రమైన శబ్దం చేస్తోంది. ఒక్కసారి వెన్నులోంచి చిత్రమైన వణుకు పుట్టుకొచ్చింది.

చటుక్కున తలుపు తీసుకొని బయటపడ్డాను.

అప్పటికే ప్రయాణీకులందరినీ డాక్టర్ ఘోష్ వెంట పంపి, విమానమంతా కలయచూస్తున్నాడు షేర్‌ఖాన్. నన్ను చూడగానే తనవెనకే రమ్మని తలవూపి విమానం

చివరకు నడిచాడు.

చివరివరుస సీట్లమధ్యలో ఎయిర్ హోస్టెస్ పడివుంది.

ఎంతో అసహజంగా, ఎవరో బలవంతంగా, కూడా విడిగా పక్కనట్లు, అసహ్యంగా కనిపిస్తోంది.

"డెడ్!" అన్నాను విచారంగా ఆ అందమైన ముఖం వైపు చూస్తూ.

అడ్డంగా తలవూపాడు షేర్‌ఖాన్, గొంతుదగ్గర చూపెడుతూ. అప్పుడు చూశాను. ఎర్రగా, ఉబ్బి, కందిపోయి, అక్కడకూడా పచ్చగా కమిలిన గుర్తులు.

"మైగాడ్! ఇటీజ్ మర్డర్."

చటుక్కునలేచి నిలబడి కాబిన్‌లోకి పరిగెత్తాను. షేర్‌ఖాన్ నా వెనకే లోపలికి వచ్చాడు.

కోపైలట్‌ను సీట్లోంచి క్రిందకులాగాను. తెల్లకిలా పడుకోబెట్టగానే కనిపించింది. నుదుట క్రింద, రెండు కనుబొమ్మలు కలిసేచోట. చుట్టూ నల్లగా మాడిపోయిన ఎర్రని రంధ్రం. పిస్తోలు గుండు చేసిన రంధ్రం!

ఒక్కక్షణం గుండె ఆగి కొట్టుకోవడం మొదలెట్టింది. విమానం కెప్టెన్ కూడా అదేవిధంగా చనిపోయాడు. త్రీ మర్డర్స్!!

4

మర్డర్! మైగాడ్ త్రీమర్డర్స్!

విమానం కూలినప్పుడు శవాలను చూడాల్సిన పరిస్థితి వస్తుందని తెలుసుగాని, హత్యచేయబడిన శవాల్ని అని మాత్రం అనుకోలేదు. ఢిల్లీటు బాంబే ఫ్లయిట్ విమానమదని షేర్‌ఖాన్ తెలుసుకొన్న దాన్నిబట్టి తెలుస్తోంది.

ఢిల్లీటు బాంబే ఫ్లయిట్ ఇప్పుడీ విమానంకూలిన చోటుకు దరిదాపుల్లో ఎక్కడాలేదు.

ఎవరయినా బలవంతంగా విమానాన్ని ఇటు మళ్ళించారా? ఎవరువాళ్ళు. ప్రయాణీకులు ఎవరూ చావలేదు. ఉన్న పదముగ్గురూ సురక్షితంగా వున్నారు.

విమానం బయల్దేరిన కాసేపటికి అందరూ నిద్రపోయినట్లు, ఎవరికీ ఏమీ తెలియనట్లు తెలుస్తుంది. అదెలా సంభవం? లేక వున్న పదముగ్గురూ కుట్రదారులేనా? అసలు విమానాన్ని ఎందుకు 'హైజాక్' చెయ్యాల్సి వచ్చింది? కారణమేమిటి?

విమానం పైలట్సు, ఎయిర్ హోస్టెస్ బ్రతికుంటే తమని గుర్తుపడతారని చంపేశారా? గుడ్ గాడ్! అంతే అయుండాలి. విమానాన్ని జాగ్రత్తగా ఈ ఎడారిలో బెల్లీలాండింగ్ చేయించగానే, తమ రహస్యాన్ని కాపాడుకోవడం కోసం చంపేసివుండాలి.

మైగాడ్! కోల్డ్ బ్లడెడ్ మర్డర్! హంతకులు మనుషుల్ని చంపడానికి వెనుకాడేవాళ్ళు కాదు.

తిరిగి 'సైలాన్ కోవ్' వెంటే మా స్థావరానికి తిరిగొస్తుంటే, నా మనసులో ఆలోచనలకు అంతులేకుండా పోయింది. మేము రక్షించిన పదముగ్గురిలో హంతకులు వున్నారు అనుకొంటుంటే వళ్ళు జలదరిస్తోంది.

మా స్థావరంలో వుండడానికి పదిమందిమి వున్నా, ఏడుగురు 'నార్త్ వెస్ట్' దిశగా 'ఇన్టెన్సివ్ ఇన్వెస్టిగేషన్' కోసం రెండ్రోజుల క్రితమే వెళ్ళిపోయారు. తిరిగి వాళ్ళు మరో పదిరోజులవరకూ రాదు.

డాక్టర్ ఘోష్, షేర్ఖాన్, నేను, మేంముగ్గురమే వీళ్ళను హేండిల్ చెయ్యాలి. అందులోనూ క్రూరమైన ఆయుధాలున్న హంతకులను.

స్థావరానికి తిరిగివెళ్ళగానే వైర్‌లెస్ ట్రాన్స్మిటరు ద్వారా జోధ్పూర్ బేస్‌ను కంటాక్ట్ చేస్తే వెంటనే

తొందర్లో కొంత సహాయాన్ని అర్థించవచ్చు, అనుకున్నాను.

విమానం సిబ్బంది హత్యచేయబడినట్లు, మేము తెలుసుకొన్నట్లు హంతకులకు తెలియకపోవడమే మంచిది. మాకు ఏమీ తెలియదని వాళ్ళు అనుకోవడంలోనే మేము బ్రతికివుండడం ఆధారపడివుంది. ఈ విషయం గురించి ఏమీ మాట్లాడవద్దని షేర్‌ఖాన్‌కు చెప్పాను.

బారెక్స్‌లో సెంట్రల్ చాంబర్‌లో అంతా కూర్చొని డాక్టర్ ఘోష్‌తో మాట్లాడుతూ వున్నారు.

నేను లోపలికి రాగానే అందరివంకా ఒక్కక్షణం పరిశీలనగా చూశాను. అందరి ముఖాలలోనూ భయం, ఆందోళన కనిపిస్తోన్నయ్.

అందరూ అమాయకంగా, ఆపదలో చిక్కుకొన్న అసహాయుల్లా—మామూలు విమాన ప్రయాణీకుల్లా కనిపించారు.

ప్రయాణికులంతా కలిపి మొత్తం పదముగ్గురున్నారు. పదకొండుమంది మగవాళ్ళు, ఇద్దరు ఆడవాళ్ళు.

గాగుల్స్ తీసేసి లోపలి భావాల్ని దాచుకొంటూ అందరివైపూ నవ్వుతూ చూశాను.

"విమానం ఎలా కూలిందో ఎవరికయినా గుర్తుందా?" అడిగాను.

"నో. విమానం ఎక్కిన ఓ గంటలోపల అందరూ ఒళ్ళు తెలియకుండా నిద్రపోయారట. మేలుకొనేప్పటికి విమానం లాండయివుంది. మనం కనిపించాము" అన్నాడు డాక్టర్ ఘోష్.

డాక్టర్ ఘోష్ అప్పటికే అన్ని వివరాలు కనుక్కొన్నట్టున్నాడు. ప్రస్తుతానికి ఆ విషయం వదిలేయదలచుకొన్నాను.

"వెల్ మైడియర్ ఫ్రెండ్స్! వెల్‌కం టు గవర్న మెంట్ జియోలాజికల్ ఇన్‌వెస్టిగేషన్ సెంటర్. మిమ్మల్ని మేము పరిచయం చేసుకోవడం అవసరం అనుకొంటూను" అన్నాను చేతిగ్లవ్స్ తీసేస్తూ.

అందరూ మా ముగ్గురివంకా నిశ్శబ్దంగా చూశారు.

"వెల్! నా పేరు సురేష్. టెంపరరీ ఇన్‌చార్జ్ టుది సెంటర్. మీతో ఇప్పటివరకూ మాట్లాడుతూ వున్నది డాక్టర్ ఘోష్. నా వెనకవున్నది మిస్టర్ షేర్‌ఖాన్. నా! మీ గురించి చెప్పండి" అన్నాను వాళ్ళవంకే చూస్తూ.

అందరూ ఇబ్బందిగా ఒకరినొకరు చూసుకొంటూ ఓ క్షణంవుండి పోయారు. ఓ లావుపాటి గళ్ళకోటాయన ఒక్కసారి భుజాలెగరేసి ఒకడుగు ముందుకువేశాడు.

"అయామ్ మన్నీలాల్. బొంబాయిలో వ్యాపారం చేస్తున్నాను. ఢిల్లీలో మా బావమరిది పెళ్ళికెళ్ళి తిరిగి వస్తున్నాను నా మిసెస్‌తో" అన్నాడు ప్రక్కనే వున్న ఒకావిడ భుజంమీద చెయ్యివేసి దగ్గరికి తీసుకొంటూ.

మిసెస్ లాల్‌ను చూస్తే ఓ క్షణం గుండె కలుక్కుమంది. ఆవిడ పూర్ణగర్భవతని చూస్తుంటేనే తెలుస్తోంది.

ఆ తర్వాత మిగతావాళ్ళ గురించి తెలియడం ఎంతోసేపు పట్టలేదు. మిగతా పదకొండుమంది వివరాలు ఇవి:

మిస్ కామినీ సర్కార్: ప్రభుత్వ వాణిజ్యశాఖ కార్యదర్శి కుమార్తె. బొంబేలో బంధువుల్ని చూడ్డానికి వెళుతోంది. వయసు పాతికలోపు.

చక్రవర్తి: టెక్స్‌టైల్ డిజైనరు. బొంబాయిలో నివాసం. వయసు యాభైఅయిదు వుండొచ్చు.

సంజల్ బోస్: క్రికెట్ ఆటగాడు. వయసు 22.

గోపాల్ సంధు: రడీమేడ్ దుస్తుల వ్యాపారం. వయసు 40.

చార్లెస్ ఫెర్రీరా: సబ్బుల కంపెనీ సేల్సు మేనేజరు. వయసు 35.

బల్వంత్ మెహ్రా: రిటైర్డ్ కాలేజ్ ప్రొఫెసర్. వయసు 60.

పి. యస్. రావు: డిస్ట్రిక్ట్ సబ్ కలెక్టరు. వయసు 25.

చాంద్ సింగ్: ఎగుమతి దిగుమతి వ్యాపారం. వయసు 30.

సునీల్ కుమార్: సినిమా నటుడు. వయసు 35.

రవివర్మ: సినిమా డైరెక్టరు. వయసు 40.

అబ్దుల్ గఫూర్: న్యాయవాది. వయసు 50.

అందరూ తమను తాము పరిచయం చేసుకోగానే గదిలోవున్న టెన్షన్ కాస్త తగ్గినట్లనిపించింది.

"మిస్టర్ సురేష్! విమానం కూలిందన్న భయంలో మొదట ఆలోచించలేదు. కాని విమానం సిబ్బంది ఏమయ్యారు?" అన్నాడు పి. యస్. రావు.

రావు మాట్లాడగానే ఒక్కసారి మళ్ళీ గదిలోని వాతావరణంలో చటుక్కున మార్పువచ్చింది.

నేను ఒక్కక్షణం రావువంక పరిశీలనగా చూశాను. చక్కటి పర్సనాలిటీ. తెలివైన కళ్ళు. అతన్లో జిల్లా అధికారికుండే దర్పం, హోదా కనిపిస్తోన్నయ్.

"డెడ్. చనిపోయారు. బహుశా లాండింగ్ షాక్ వల్ల ననుకొంటాను" అన్నాను.

"ఆర్ యూ ష్యూర్ మిస్టర్ సురేష్! ఒకవేళ వాళ్ళు బ్రతికుంటే" బల్వంత్ మెహ్రా స్వరం కొద్దిగా వణికి నట్లనిపించింది.

"యస్! అయామ్ పాజిటివ్ అబవుట్ ఇట్. వాళ్ళను

బయటికితీసి పరీక్ష చెయ్యలేదుగాని, ఎవరికీ గుండె కొట్టుకోవడంలేదు, విమానం వదిలి వచ్చేముందు ఐమేడ్ ష్యూర్!" అన్నాను. ఆ మాటలు చెపుతోంటే నాఒళ్లు ఒక్కసారి జలదరించింది.

గదిలో ఒక్క క్షణం నిశ్శబ్దం ఆవరించింది.

"ఈ ఎడారిలోనుండి బయటకు వెళ్ళడం ఎలా? ఈ యాక్సిడెంట్ గురించి అధికారులకు ఎలా తెలుస్తుంది?"

అందరిచూపులు అటుతిరిగాయి. చార్లెస్ ఫెర్రిరా ముఖంలో చాలా ఆందోళన కనిపిస్తోంది. అందరి మనసుల్లో వేధిస్తున్న ప్రశ్నను అతను అడిగాడు.

అందరూ నేనేం చెపుతానో అని ఊపిరి బిగబట్టుకొని చూస్తున్నారు.

"ఇక్కడికి యాభైమైళ్ళ చుట్టూ ఏ వూరుగాని, పల్లెగాని లేవు. వారానికోసారి మాత్రం జోధ్‌పూర్ నుండి ఓ విమానంవచ్చి మాకు కావలసిన సప్లయిస్ డ్రాప్ చేసి వెళ్ళిపోతుంది. ఇక్కడికి దగ్గరలోవున్న వూరు అరవై మైళ్ళ దూరంలోవున్న శ్రీమోహన్‌ఘర్ అనే చిన్న వూరు" అన్నాను ఒక్కసారి పరిసరాల్ని గుర్తుకు తెచ్చుకొంటూ.

"అయితే ఇక్కడనుండి శ్రీ మోహన్‌ఘర్ చేరడం ఎలా?" అడిగాడు గోపాల్ సంధు.

"కాలి నడకన ఈ ఎడారిలో నడవడం అసాధ్యం. పగలు విపరీతమైనవేడి, రాత్రిళ్ళు విపరీతమైన చలి వుంటాయి. అయినా మరో ముప్పై ఆరుగంటల్లోగా యీ ఇసుక తుఫాన్‌లో మనం బయటకు కదలడం సాధ్యపడదనుకొంటాను."

అంతా ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ నావంక చూశారు.

"అంటే ఈ తుఫాను తగ్గితేగాని మనం కదలడానికి వీలుండదా?" చాంద్ సింగ్ గొంతు వణకడం కనిపించింది.

"నో! నా టెచాన్స్! తుఫాను తగ్గేవరకూ బయల్దేరడం కల్ల. తగ్గిన తరువాతైనా నడిచివెళ్ళడం అసంభవం."

"అయితే మరెలా?" అబ్దుల్ గఫ్ఫార్ మొట్టమొదటి సారి మాట్లాడాడు.

"తుఫాను తగ్గనివ్వండి ఆలోచిద్దాం" అన్నాను సమాధానంగా.

అప్పటిదాకా టువే రేడియో ట్రాన్స్మిటరుద్వారా జోధ్ పూర్ బేస్ను 'రైజ్' చెయ్యడానికి విఫలప్రయత్నం చేసి, లాభంలేక స్విచ్ ఆఫ్ చేసి సిగరెట్ వెలిగించాడు షేర్ ఖాన్.

"క్వయిట్ ఇంపాజిబిలిటీ! ఈ తుఫాను తగ్గేవరకూ ట్రాన్స్మిటరు వుపయోగం వుండదనుకొంటాను" అన్నాడు డాక్టర్ ఘోష్.

ట్రాన్స్మిటరు రిప్లై సిగ్నల్ కోసం చెవులు రిక్కించుకొని వింటున్న అందరూ నిస్పృహగా నిట్టూర్చారు.

షేర్ ఖాన్ అందరికీ బిస్కట్లు, వేడివేడి టీ అందించసాగాడు. అందరూ కృతజ్ఞతగా పుచ్చుకొన్నారు. నేనుమాత్రం నామీద పెరుగుతోన్న బాధ్యతను గుర్తుతెచ్చుకొంటూ ఒక్క క్షణం దిగులుపడ్డాను.

జోధపూర నుండి రావలసినరోజుకు సప్లయిస్ రాకపోవడంవలన, మా దగ్గరవున్న 'రిజర్వ్ రేషన్స్' వాడుతున్నాము.

టీ ఆకు, పంచదార తరగనంతవున్నా ఆహార పదార్థాలు మాత్రం ఈ పదిహేనుమందికి ఒక్క రోజుకుకూడా చాలవు. అవి అయిపోతే, ఈలోగా ఈ తుఫాను తగ్గకపోతే అంధరూ ఆకలికి మాడి చావాల్సిన పరిస్థితి ఏర్పడు

తుంది.

పైగా, ఈ విమానం సిబ్బంది మరణాల మిస్టరీ నా మెదడును తినేస్తోంది. అసలు విమానం మార్గం మళ్ళి. ఇటెందుకొచ్చింది? ఎవరు మళ్ళించారు? ఎందుకు చేశారు? వీరిలో ఆ హంతకులెవరు?

త్వరగా జోధ్‌పూర్ బేస్‌తో కనెక్షన్ వస్తే బావుండును. బయట ప్రపంచంతో సంబంధం కలిగితే కాస్త ధైర్యంగా వుంటుంది.

అసలు చేరవలసిన టైముకు విమానం చేరకుండా, వెళ్ళవలసిన మార్గంలో పోకుండావుంటే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలు సిబ్బంది ఏం చేస్తున్నట్లు?

తలవిదిలించి ఓసారి గదిచుట్టూ చూశాను. షేర్‌ఖాన్ ఇచ్చిన పదార్థాలతో సేదతీరి అంతా మెల్లిమెల్లిగా నిద్రలోకి జారుకొంటున్నారు. షేర్‌ఖాన్ గదిబయట స్టూలు మీద మళ్ళీ 'సెంట్రీ' కూర్చున్నాడు. తెల్లవారుజామున అతనికి నేను రిలీఫ్ ఇవ్వాలి.

అలసటగా నేనూ కళ్ళు మూసుకొన్నాను.

5

చటుక్కున మెలకువవచ్చింది. షేర్‌ఖాన్ చెయ్యి పట్టుకొని నన్ను ఊపుతున్నాడు.

బదకంగా కళ్ళు తెరిచి చూశాను.

గదిలో దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది. పడుకొన్న వాళ్ళందరూ లేచి గదిలో ఓమూల గూమిగూడి వున్నారు. తలవిదిలించి లేచి నిలబడ్డాను.

"వాటీజిట్ ఖాన్?" అన్నాను గుంపు దగ్గరికి నడుస్తూ.

షేర్‌ఖాన్ మాట్లాడలేదు. నా వెనుకే గుంపు దగ్గరికి

వచ్చాడు.

అక్కడి దృశ్యాన్ని చూసి నా కళ్ళను నేను నమ్మలేనట్లు చూస్తూ వుండిపోయాను. కోపం, నిస్సహాయం ఒక్కసారి గుండెల్లో పెల్లుబికాయి.

గదిమూల టేబిల్ మీద వున్న రేడియో ట్రాన్సిస్టరు క్రిందపడి ముక్కలు ముక్కలై వుంది.

మాకున్న ఒకే ఒక ఆశ, ఈ ఎడారినుండి మానవ ప్రపంచంతో సంబంధాలు కలిపే ఒకేఒక మార్గం, ముక్కలు చెక్కలై, అర్థంలేని, ఆకారంలేని వస్తువులా క్రిందపడివుంది.

ప్లాస్టిక్ కాబినెట్, లోపల గాజువాల్వులు పొడిపొడి ముక్కలుగా అయి దీపంకాంతిలో నన్ను వెక్కిరిస్తున్నట్లు మెరుస్తున్నాయి.

ఒక్క క్షణం అందరివంకా క్రోధంగా చూశాను. "డామ్ యు! ఎవరు చేశారీపని?" పిచ్చాళ్ళా అరిచాను.

నా అరుపుకు ఒక సెకనుపాటు బయట తుఫాను శబ్దం వినిపించలేదు. అందరూ గుడ్లప్పగించి తెల్లబోయి నావంక చూస్తున్నారు.

"జవాబు చెప్పండి. హు డిడ్ దిస్ బ్లడీథింగ్?"– మళ్ళీ అరిచాను.

అందరూ నోటిమాట పోయినట్లు నిలబడ్డారు. నిముషంపాటు అందరి ముఖాలవంకా చూస్తూ వూరుకున్నాను. మెల్లిగా కోపంతగ్గి, వాస్తవం మెదడులోకి ప్రవేశించింది.

"షేర్ ఖాన్! ఎలా జరిగింది?" అన్నాను శాంతంగా.

"అంతా నిద్రపోయిన తరువాత లైట్ ఆఫ్ చేశాను సాబ్. లైట్ ఆఫ్ చేసి బయట కూర్చున్న పదినిముషాలకు బఠ్ఠ్మని చప్పుడయింది. వెంటనే లైటు వెలిగించాను. చప్పుడుకు అందరూ నిద్రలేచివున్నారు. ట్రాన్సిస్టరు

క్రిందపడి ముక్కలైవుంది"-అన్నాడు షేర్‌ఖాన్ నింపాదిగా.

నేను తలవూపి అందరివైపు ఒకసారి చూశాను. ఇది కావాలని ఎవరో చేశారనడంలో సందేహంలేదు. ట్రాన్సిస్టర్‌తో బేస్‌ను రైజ్ చెయ్యగలిగితే తమ ఆట కట్టుతుందని వాంతట్లో ఎవరో ఈపని చేసుండాలి.

"ఆల్‌రైట్! ట్రాన్సిస్టర్‌కి దగ్గరగా పడుకున్న దెవరు?"

రవివర్మ భయంభయంగా నావంక చూశాడు. "నేను పడుకున్నాను."

"నిద్రలో పొరపాటున మీకాలు టేబిల్‌కేమయినా తగిలిందా?"

ఈ ప్రశ్న అనవసరం అని తెలుసు. ఏమరుపాటున కాలుతగిలి టేబిల్ కదిలినంతమాత్రాన అంత బరువైన, వెడల్పైన ట్రాన్సిస్టరు క్రిందపడదు.

"లేదు. గుర్తులేదు" అన్నాడు నిస్సహాయంగా.

నేనతనివైపు తీక్షణంగా చూశాను. "మిస్టర్ వర్మా! దయచేసి గుర్తు తెచ్చుకోండి. దాదాపు ముఫైకిలోల బరువున్న ట్రాన్సిస్టరు దానంతట అది ఎగిరి క్రింద పడదు" అన్నాను.

రవివర్మ జాలగా నావైపు చూశాడు. "నో! మిస్టర్ సురేష్! నాకేం తెలియదు. నిద్రలో నా కాళ్ళు టేబిలుకు తగిలే అవకాశంలేదు. టేబిల్‌కు దగ్గరగా పడుకున్నా అంతగా తగిలేట్లు పడుకోలేదు నేను"-

"డామిట్! మనకు సరైన సమయంలో సహాయం తెచ్చే ఆధారం ఆ ట్రాన్సిస్టరే. ఇప్పుడా అవకాశం లేకుండా పోయింది. ఈ ఎడారిలో, ఈ తుఫానులో

నుండి బయటపడడానికి ఇక మిమ్మల్ని ఆ దేవుడే రక్షిం చాలి"—అన్నాను బాధగా.

6

మర్నాడు పగలంతా కూడా తుఫాను తగ్గలేదు.

రాత్రిపూట చీకట్లో శబ్దంతప్ప మరేమీ తెలియదు గాని, పగలు వెలుతుర్లో గాలిలో అలల్లా తేలుతూ వస్తోన్న ఆ ఇసుక తెరలు చూస్తుంటే ఎంత ధైర్యవంతుడి కయినా గుండెలు జలదరించక మానవు.

నేను ఓ ప్రక్కన కూర్చొని జరిగిన విషయాలన్నీ ఓసారి నెమరువేసుకొన్నాను.

ఈరోజు రాత్రితో నిలవవున్న ఆహారమంతా అయి పోతుంది. ఆ తర్వాత ఇక్కడున్న పదిహేను మందికీ తుఫానుతోబాటు తిండికూడా ఓ పెద్ద సమస్యే కాచుం టుంది.

అదృష్టం బావుంటే బహుశా రేపాగున్నకల్లా ఈ ఇసుక తుఫాను తగ్గవచ్చు. తగ్గితే ఇక్కడ నుండి శ్రీ మోహన్ ఘర్ వ కదిలే ప్రయత్నం చెయ్యాలి.

రాత్రి ట్రాన్స్మిటరు పగలడం యాధృచ్ఛికంకాదని మేం ముగ్గురం నిశ్చయించుకొన్నాము. బయట ప్రపం చంతో సంబంధం లేకుండా చెయ్యడం హంతకుల ఉద్దే శ్యమని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకని?

ఎడారిలో పరిస్థితి వాళ్ళకీ తెలుసు. నలభై ఎనిమిది గంటల్లోగా సరైన సహాయం అందకపోతే అందరూ ఈ ఇసుక ఎడారిలో చావక తప్పదు. అలాంటప్పుడు నాగరిక ప్రపంచంలో చేరే అవకాశాన్ని ఎందుకు చెడగొడుతున్నారు. ఇంతకూ వాళ్ళలో ఆ హంతకు లెవరై వుంటారు?

"అందర్నీ బెదిరించి వాళ్ళ సామాన్లు వెతికితే మనకీ హంతకులెవరో తెలియొచ్చు. పైలట్ ని, సిబ్బందిని చంపడానికి ఉపయోగించిన పిస్తోళ్ళు ఇంకా వాళ్ళదగ్గరే వుండొచ్చు" అన్నాడు డాక్టర్ ఘోష్.

"నో! నా టెచాన్స్! ఆ పిస్తోళ్ళు ఇంకా వాళ్ళదగ్గర వున్నయ్యా లేదా అనేది అనుమానాస్పదం. ఒకవేళ లేకపోతే అనవసరంగా విషయాలన్నీ అందరికీ చెప్పి భయపెట్టడం అవుతుంది. వున్నా వాళ్ళను లొంగదీసుకోవడం జరగని పని. తమ రహస్యం బయట పడుతుందనుకొంటే అందర్నీ చంపడానికి వెనుకాడని మనుషులు హంతకులు" అన్నాను తల అడ్డంగా ఊపుతూ.

"అయితే మరేం చేయడం?"

"ఏమీ తెలియనట్లు నటించడమే మంచిది. హంతకులు మనకేమీ తెలియదని అనుకొన్నంతకాలం మన ప్రాణాలకేం భయంలేదు. రేపు తుఫాను తగ్గగానే వెంటనే శ్రీ మోహన్ ఘర్ కు బయల్దేరుదాం. అంతవరకూ అందరిమీదా ఓ కన్నేసి వుంచండి."

"అందర్నీ అనుమానించడం అనవసరమేమో అనుకొంటాను" అన్నాడు షేర్ ఖాన్.

నే నతనివంక ఆశ్చర్యంగా చూశాను.

అవునన్నట్లు తలవూపాడు. "చున్నీలాల్ ను అనుమానించాల్సిన అవసరంలేదు. అలాగే చంచల్ బోస్ నుకూడా. అతని ఫోటో చాలాసార్లు న్యూస్ పేపర్లలో చూశాను. నేషనల్ ఫిగర్. బల్వంత్ మెహ్రా, వినూ చక్రవర్తిని కూడా లిస్ట్ లోనుంచి తొలగించవచ్చు. దౌర్జన్యాలుచేసే వయసుకాదు వాళ్ళది. మిగిలిన ఎనిమిదిమందిని జాగ్రత్తగా గమనించడం మంచిది."

"హౌ ఎబవుట్ కామిని సర్కార్. ఆడది అలాంటి

ఘోరమైన హత్యలు చేస్తుందంటావా?"

షేర్‌ఖాన్ చిత్రంగా భుజాలెగురేశాడు. "ఏం చెప్ప గలం?" అన్నాడు.

మనసులో షేర్‌ఖాన్‌కు ఓ క్షణం కృతజ్ఞతలు చెప్పు కొన్నాను. పదముగ్గురికన్నా ఎనిమిదిమందిని గమనించడం తేలిక.

క్రమక్రమంగా చీకటి పడుతోంది.

చీకటితో పాటు గాలి ఉధృతం కూడా పెరగసాగింది. ఒక్కొక్కసారి గాలితెర వచ్చినప్పుడు బారెక్ కప్పు లేచి పోతుందేమో అనిపిస్తోంది.

అందరూ వేడివేడి చాకొలెట్ టీ త్రాగి కూర్చొ న్నారు. అందరి గుండెల్లో దిగులు. భవిష్యత్తుని గురించి, ఇక్కడనుండి ఎలా బయటపడతామో అని. మళ్ళీ బ్రతికి వుంటే బయట ప్రపంచాన్ని చూస్తామా అని.

అప్పుడు గుర్తొచ్చింది నాకు. నేను చేసిన పొరపాటు. ఈ విషయం ఇరవై నాలుగు గంటల క్రితమే గుర్తొస్తే ఈ పాటికి మేమందరం సురక్షితంగా వుండడానికి ఏర్పాట్లు జరిగుండేవి.

ఒక్కక్షణం నన్ను నేను తిట్టుకొని షేర్‌ఖాన్‌కు సైగ చేశాను. మేమిద్దరం వరండాలో ఒంటరిగా నిలబడ్డాం.

వరండానిండా ఇసుక కుప్పలుగా పడివుంది. తుఫాను తగ్గేముందు చివరదశ. ఈ ఉధృతం తగ్గగానే తుఫాను ఆగిపోతుందని తెలుసు.

ఏమిటన్నట్లు చూశాడు షేర్‌ఖాన్.

"విమానంలో రేడియో ట్రాన్స్మిటరు ఉంటుందన్న విషయం మనం మరిచిపోయాం. మన ట్రాన్స్మిటరుకన్నా చాలా పవర్‌ఫుల్‌ది వుంటుంది. దాంతో కంట్రోల్ స్టేషన్‌కు కనెక్ట్ చెయ్యగలిగితే మనకష్టాలు సగం తీరు

తాయి. అసలు విషయమేమిటో కూడా తెలుసుకోవచ్చు"
అన్నాను.

షేర్‌ఖాన్ నావంక ఆశ్చర్యంగా చూశాడు. తరువాత అవునన్నట్లు తలాడించాడు.

"వెళదామా?" అన్నాడు.

నేను అడ్డంగా తలాడించాను. బయట గుట్టలుగా పడున్న ఇసుకను చూపించాను.

"నో, ఇప్పుడు కాదు. విమానం తలుపు సగానికి పైగా ఇసుక పేరుకొనిపోయి వుంటుంది. తలుపు తెరవాలంటే చుట్టూవున్న ఇసుక తొలగించాలి. మనం బయటికి వెళ్ళి చాలాసేపువుంటే లోపలి వాళ్ళకు అనుమానం రావచ్చు" అన్నాను.

రాత్రి అందరూ పడుకొన్నాక విమానం దగ్గరికి వెళ్ళాలని నిశ్చయించుకొన్నాము. మేము బయటికి వెళ్ళినప్పుడు డాక్టర్ ఘోష్‌ను సెంట్రీగా వుండమని చెప్పాను.

7

రాత్రి అందరూ ఓచోట గదిలో పడుకొన్నారని నిశ్చయించుకోగానే నేను, షేర్‌ఖాన్ చప్పుడు లేకుండా బయటికి వచ్చాము. హాలుబయట సెంట్రీగా కూర్చొన్న డాక్టర్ ఘోష్ 'గుడ్‌లక్' అన్నట్లు నాలుగువేళ్ళు మడచి బొటనవేలు పైకెత్తి సైగ చేశాడు.

నేను, షేర్‌ఖాన్ 'శోవెల్' సహాయంతో పదినిము షాల్లో విమానాన్ని చేరుకొన్నాము.

అనుకున్నదానికంటే ఎక్కువగానే ఇసుక విమానం చుట్టూ పేరుకొంది. కిటికీల వరకు పేరుకుపోయిన ఇసుకలో, సముద్రంలో సగం సగం తేలుతున్న చిన్న తిమింగలంలా అవుపిస్తోంది విమానం.

'షావెల్స్'తో ఇద్దరం తలుపుదగ్గర ఇసుకను గబగబా తోడడం ప్రారంభించాము.

మనిషిదూరి లోపలకు వెళ్ళడానికి వీలయినంత తెరుచుకోనేందుకు దాదాపు ఇరవై నిముషాలపైనే త్రవ్వాము. మామూలుగా అయితే రెండు నిముషాలకన్నా ఎక్కువ పట్టదు. కాని త్రవ్వితీస్తున్న ఇసుక మళ్ళీ క్రిందకు జారి త్రవ్వెందంతా పూడిపోతుంది. దానికితోడు వీపుమీద నిరంతరం వానలా కురుస్తోన్న ఇసుక.

విమానం లోపలికి ప్రవేశించి రెండుక్షణాలు బరువుగా ఊపిరి పీలుస్తూ ఆగిపోయాము.

లోపలంతా శవం కుళ్ళిన దుర్గంధం వస్తోంది. అవును! పగలున్న వేడికి శవాలు చాలా త్వరగా కంపుకొడతాయి. చకచకా కాక్‌పిట్ లోపలకు వెళ్ళాము.

తళతళ మెరుస్తోన్న డయల్స్‌తో, ఫ్లాష్‌లైట్ కాంతిలో రేడియో ట్రాన్స్‌మిటరు ఓ ప్రక్క వుంది. స్విచ్ ఆఫ్ చేసివుంది.

"బ్యాటరీ వుందో, అయిపోయిందో చూడాలి" అన్నాడు షేర్‌ఖాన్ స్విచ్ ఆన్ చేస్తూ.

కరకర శబ్దం వినిపించింది. ఫ్లాష్‌లైటు కాంతిలో షేర్‌ఖాన్ ముఖంలో నవ్వు చూడగానే ఒక్కక్షణం తృప్తిగా శ్వాసపీల్చి వదిలాను.

వేవ్‌లెంగ్త్ కదపకుండా, డయల్ చూపిస్తున్న వేవ్‌లెంగ్త్ మీదే సిగ్నల్ పంపించడం ప్రారంభించాడు.

విమానం జాడ తెలియకుండా పోయిన ఇరవైనాలుగ్గంటల తరువాతకూడా కంట్రోల్ స్టేషన్ వాళ్ళు ఆ వేవ్‌లెంగ్త్ మీదే వింటూ వుంటారని అనుకోను. అయినా తప్పదు. ప్రయత్నించాలి.

రెండు నిమిషాల సిగ్నలింగ్ తరువాత, సమాధానం కోసం మరో నిముషం ఆగిచూశాము. రిసెప్షన్ సిగ్నల్ బల్బు మామూలుగా వెలుగుతోంది. అంటే అటుప్రక్క ఎవ్వరూ ట్రాన్స్మిషన్ రిసీవ్ చేసుకోవడం లేదన్న మాట. వెంటనే జోధ్‌పూర్ బేస్ వేవ్ లెంగ్త్ మీద సిగ్నల్ పంపమని చెప్పాను.

మామూలుగా ప్రతి గురువారం ఉదయం పదినుండి పదకొండుమధ్య మా ట్రాన్స్మిటర్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తారు వాళ్లు. రిసీవింగ్ సెట్‌లో ఆ వేవ్ లెంగ్త్ మీద ట్రాన్స్మిషన్ చేసే సమయంలో రిసెప్షన్ లేకపోతే ఎన్ని సిగ్నల్స్ పంపినా వృధాయే. అయిదు నిముషాలు సిగ్నల్స్ పంపి సెట్ ఆఫ్ చేశాడు షేర్‌ఖాన్.

ఒక్క క్షణం నిరాశగా ట్రాన్స్మిటరువైపు చూశాను. చటుక్కున ఓ విషయం స్ఫురించింది.

“జోధ్‌పూర్ రేడియో స్టేషన్ గాని, బికనీర్ రేడియో స్టేషన్ గాని ఏ వేవ్ లెంగ్త్స్ మీద ప్రోగ్రాం ప్రసారం చేస్తాయి?” అడిగాను.

“జోధ్‌పూర్ షార్ట్ వేవ్ 30.1మీద ప్రసారంచేస్తుంది” అన్నాడు షేర్‌ఖాన్ ఓ క్షణం అర్థం కానట్లు.

మామూలుగా ఎప్పుడయినా రేడియో ఆన్ చేసినప్పుడు, స్టేషన్ ఇండికేటర్ నీడిల్ త్రిప్పుతోంటే మనకు అర్థంకాని సంభాషణలు వినిపిస్తుంటాయి అప్పుడప్పుడు. అవి ఎయిరో డ్రోమ్ ఫ్లయిట్ కంట్రోల్ రూమ్ అధికారులు, మార్గమధ్యంలోవున్న విమానం నావిగేటర్లకు మధ్య జరిగే సంభాషణ అని చాలామందికి తెలియదు.

ఆ సూత్రాన్నే నే నిప్పుడు అమలు చేస్తున్నాను. ఎవరైన ఈ టైమ్‌లో జోధ్‌పూర్ రేడియో స్టేషన్ ఆన్

చేస్తే మేము ప్రసారంచేసేది వినే అవకాశంవుంది. రాజస్థాన్‌లో వున్న కొన్ని వేల రేడియో సెట్లలో కనీసం ఒకటయినా ఆ టయిములో ఆన్ అయివుండదా అని మా ఆశ.

త్రీ పాయింట్ వన్ కు డయల్ సరిచేసి నేను చెప్పిన మెసేజ్‌ను రేడియో అనౌన్సర్‌లా ప్రసారం చెయ్యడం మొదలు పెట్టాడు షేర్‌ఖాన్.

"ప్రిసీజ్ ఇండియన్ గవర్నమెంట్ జియోలాజికల్ సెంటర్ కాలింగ్ ఫ్రమ్ థార్. రిపీట్. ప్రిసీజ్ గవర్నమెంట్ జియోలాజికల్ సెంటర్ కాలింగ్ ఫ్రమ్ థార్. ఢిల్లీ-టు-బాంబే ఫ్లయిట్ నిన్న రాత్రి మా సెంటర్‌కు ప్రక్కన కూలిపోయింది. సిబ్బంది మర్డర్ చెయ్యబడ్డారు. ప్లీజ్ పాస్ ది మెసేజ్ టు ది అథారిటీస్. దగ్గరవున్న అధికారులకు ఈ విషయం వెంటనే తెలియ చెయ్యండి. ప్రిసీజ్ ఎమర్జన్సీ."

మెసేజ్‌ను మళ్ళీ మళ్ళీ రిపీట్ చెయ్యమని చెప్పాను షేర్‌ఖాన్‌కు.

8

ఏదో శబ్దం. ఎవరో విమానాన్ని సుత్తులతో బాదుతున్నట్లు ఒక్కొక్క దెబ్బకు విమానం గోడలు కదులుతున్నట్లనిపించాయి.

షేర్‌ఖాన్‌ను సంజ్ఞలతో హెచ్చరించి, తలుపు దగ్గరకు పరిగెత్తాను.

తలుపు మూసేసి వుంది.

ఒక్కసారి గుండె ఝల్లుమంది.

మేం లోపలకు వచ్చేప్పుడు గాలికి తలుపు మూసుకోకుండా 'పిక్‌యాక్స్' అడ్డం పెట్టి వచ్చాము.

రెండు చేతులతో తలుపును గట్టిగా తోశాను. రెండు వేళ్ళు పట్టేంత సందు వచ్చింది. బయటినుండి ఎవరో అదిమిపడుతోన్నట్లనిపించింది. మేము త్రవ్వి పోసిన ఇసుకంతా మళ్ళీ తలుపు చుట్టూ పేరుకొంది.

తలుపును ఇంకా బలంగా త్రోశాను. మరో అంగుళం కదిలింది...అంతే అంతకన్నా తెరవడానికి నా బలం చాలలేదు.

ఎవరో విమానం అడుగుభాగాన్ని ఇంకా బాదుతోనే వున్నారు. తలుపు సందులోనుండి బయటకు చూశాను. ఎవరూ కనుపించడంలేదు. సర్రున వీచే గాలితోపాటు ఇసుక కణాలు గాగుల్స్‌ను కొట్టుకొంటూ దృష్టికి ఆటంకం కలిగిస్తున్నాయి.

ఉన్నట్టుండి శబ్దం ఆగిపోయింది. ఒక్క క్షణం గాలి, ఇసుక చప్పుడు తప్ప మరేం వినిపించలేదు.

అంతే, మరుక్షణం ఎర్రనిమంట విమానం వెనకవైపు కనిపించింది.

మైగాడ్! విమానం పెట్రోల్ టాంకులను ఎవరో అంటించారు. చటుక్కున వెనక్కి తిరిగి కాబిన్‌లోకి పరిగెత్తాను.

షేర్‌ఖాన్ మెసేజ్ చెపుతోనే నావంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"డ్రాప్ ఇట్ ఖాన్! కమాన్ క్విక్! ఎవరో స్పేర్ ఫ్యూయల్ టాంక్స్ అంటించారు" అన్నాను వెనక్కి తిరిగి పరిగెడుతూ.

షేర్‌ఖాన్ నా వెనకాలే పరిగెత్తుకొచ్చాడు.

ఇద్దరం కలసి తలుపును బలంగా తొయ్యడం ప్రారంభించాము. దాదాపు ఆరంగుళాలు సందు ఏర్పడింది. ఎవరో తలుపుమూసి, దానిచుట్టూ గోతిలో ఇసుకపోసి వుండాలి.

ఇసుక అరఘులుగా వుండడంవలన మరో రెండంగుళాలు తెరవడానికి సాధ్యపడింది. సందులోనుండి ఎర్రని మంటలు కనిపిస్తోన్నయ్.

హైలీ ప్యూరిఫైడ్ వైట్ పెట్రోల్. మేము బయట వదలిన పిక్‌యాక్స్‌తో తోక భాగంలోవున్న టాంక్స్‌కు చిల్లుపెట్టి వుండాలి. బయట ఇసుక పడుతోన్నా, టాంక్ లోపల 'కావెటీ'లో గాలివత్తిడి పెరిగి టాంకులు పేలిపోయే ప్రమాదం వుంది.

తలుపు సందులోంచి ఇద్దరం బయటపడ్డాము.

బుస్సుమంటూ మండుతున్న సన్నని ఎర్రని మంటలు కనిపిస్తున్నాయి. చేయిచాచి నైలాన్ రోప్ అందుకోవడానికి ప్రయత్నించాను. చేతికందే దూరంలో రోప్ తగల్లేదు.

ఒక్కసారి గుండె ఝల్లుమంది. 'రోప్ వే' సహాయం లేకపోతే స్థావరాన్ని చేరుకోవడం చాలాకష్టం.

“కమాన్ సాబ్! రోప్ కోసం వెతికే ప్రయోజనం లేదు. స్ట్రెయిట్ లైన్‌లో పరిగెడితే బారెక్స్‌కు దగ్గరగా వెళతాము”

అన్నాడు షేర్‌ఖాన్ ముందుకు పరిగెడుతూ.

నేనూ అతని వెనుకే పరుగు ప్రారంభించాను. టాంకులు పేలేసమయానికి దగ్గరలో వుంటే చాలా ప్రమాదం.

“రోగ్స్! డర్టీ రోగ్స్!” తిట్టుకొన్నాను కసిగా పరిగెడుతూనే.

యాభై గజాలు పరిగెత్తి వుంటాము. పరిగెడుతోంటే బూట్లు ఇసుకలో కూరుకుపోయి ఎక్కువదూరం పరిగెత్తడానికి వీలులేకుండా వుంది.

అప్పుడే పెద్ద ధ్వని వినిపించింది. షేర్‌ఖాన్ ఎగిరి బోర్లాపడ్డాడు. నేను అతనిప్రక్కనే రెండు చేతుల్లో

ముఖం దాచుకొంటూ క్రిందపడ్డాను.

వెంటనే బాంబు పేలినట్టు రెండు పెద్ద శబ్దాలు మా వెనకే వినిపించాయి. శబ్దం వెంటనే ఎర్రటికాంతి ఓ అర నిముషంపాటు చుట్టూ పరిసరాల్ని ముంచేసింది. వెంటనే చీకటి అలుముకొంది.

ఓ రెండు నిముషాలపాటు ఊపిరి బిగబట్టినట్లు అలాగే పడుకొని వుండపోయాము. అప్పటికే ఇసుక మమ్మల్ని సగంవరకు కప్పేట్టింది. మరికాసేపు ఆగితే సజీవ సమాధే చేసేస్తుంది.

మెల్లిగా పైకిలేచి విమానంవున్న వైపు చూశాము. ఎర్రగా అక్కడక్కడా సన్నగా మండుతోన్న మంట కనిపిస్తోంది. కొద్ది నిముషాల్లో ఆ మంటకూడా ఆరిపోతుంది. నిరంతరం వానజల్లులా ఇసుక పడడంవలన పెద్దగా మంటమండే అవకాశంలేదు.

విమానం నామరూపాలు లేకుండా ధ్వంసమయిపోయింది. అంటే రేడియో ట్రాన్స్మిటరుతో మరో మెసేజ్ పంపే అవకాశంలేదు.

ఎవరో మా వెనకేవచ్చి మేము విమానం లోపలకు వెళ్ళగానే తలుపుమూసేసి, తెరుచుకోకుండా ఇసుకపోసి, ఫ్యూయల్ టాంక్స్‌కు చిల్లుపెట్టి నిప్పంటించారు. ఎవరు వాళ్ళు?

9

గదిలో డాక్టర్ ఘోష్‌ను చూడగానే జరిగిందేమిటో వూహించగల్గాను.

గదిమధ్య దీపంక్రింద డాక్టర్ ఘోష్ నీరసంగా కళ్లు మూసుకొని కూర్చొనివున్నాడు. నంవల్ బోస్ ఆయన తలచుట్టూ డ్రస్సింగ్ చేస్తున్నాడు.

గదిలోకి రాగానే "మాకుముందు బయటినుండి గదిలోకి వచ్చిందెవరు?" అన్నాను రొప్పుతూ.

ఎవరూ మాట్లాడలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు.

అంతలో, డాక్టర్ ఘోష్ భారంగా కళ్ళు తెరచి మావంక చూశాడు. ఆయన్ని తలవెనుక ఎవరో బలంగా కొట్టారు. మమ్మల్ని చూసి బలహీనంగా నవ్వి, మంచినీళ్ళు అని సైగచేశాడు. డాక్టర్ ఘోష్ మంచినీళ్లు త్రాగగానే అడిగాను. "డాక్టర్! అసలు ఏం జరిగింది?"

"మీరు వెళ్ళిన రెండు, మూడు నిమిషాలకు గదిలో ఎవరో కదిలిన అలికిడయింది. లేచి లైట్ స్విచ్ ఆన్ చేయబోయాను. లైటు వెలిగే లోపలే ఎవరో తలమీద బరువైన వస్తువుతో మోదారు. నాకు స్పృహపోయింది. నాకు తిరిగి స్పృహ వచ్చేటప్పటికి గదిలో మిస్టర్ బోస్ నా ముఖంమీద నీళ్ళుచల్లుతూ కనిపించారు. మిగిలిన అందరూ చుట్టూవున్నారు" అన్నాడు ఘోష్ నెమ్మదిగా ఒక్కొక్క మాటే పలుకుతూ.

నేను తలవూపి అందఱివంకా చూశాను.

"డాక్టర్ ఘోష్‌ను గదిలోకి తెచ్చిం దెవరు?"

చంచల్ బోస్ నావైపు అలసటగా చూశాడు. "హఠాత్తుగా నిద్రలో పెద్దశబ్దం. ఏదో ఎక్స్‌ప్లోషన్ జరిగినట్లు విని మెలకువ వచ్చింది. బహుశా అందరూ ఆ శబ్దం వినుండాలి. అందరూ మేలుకొని భయంగా ఏమిటేమిటని అడుగుతున్నారు. నేను లేచి లైటు వేయబోయాను- కాని అప్పటికే సర్దార్‌జీ లైట్ స్విచ్ వేశారు."

"వెయిటె మినిట్! గదిలో లైటు వెలిగినప్పుడు అందరూ లోపలే వున్నారా?" అడిగాను.

బోస్ విచిత్రంగా భుజాలెగురేశాడు. "గమనించలేదు.

అందరూ భయంగా గదిలోకి, వరెండాలోకి తిరుగుతున్నారు. మా ముగ్గురిలో ఎవరూ కనిపించలేదు. వరండాలో లైటు వెలిగించేసరికి డాక్టర్ ఘోష్ కాళ్ళూ చేతులు కట్టిపడేసి, నోట్లో గుడ్డలు కుక్కబడి స్పృహ లేకుండా పడివున్నారు. వెంటనే ఆయన్ని లోపలకు తీసుకొచ్చి ఫస్టెయిడ్ చేశాను" అన్నాడు.

'డామిట్' అనుకొన్నాను పళ్ళుబిగించి లోపలే.

పరిస్థితి నా చేతుల్లోంచి జారిపోతుం దనడంలో సందేహం లేదు. అవసరమొస్తే హంతకులు అందర్నీ చంపిపోతారనడంలో కూడా సందేహం లేదు. కాని ఆపదలో వున్న మిగిలిన అమాయకులకు తమ స్థితేమిటో తెలియజెయ్యడం మంచిదనిపించింది.

దానివల్ల కొంత రిస్క్ తగ్గుతుంది. తమతో ఎవరో అంతు తెలియని హంతకుడున్నాడని తెలిస్తే, ప్రాణభయంతో ప్రతీ మనిషీ ప్రక్క మనిషిని అనుక్షణం కనిపెడుతూ వుంటాడు. దానివల్ల హంతకులు ఇదివరలా చొరవచేసే అవకాశం లేదు.

నేను షేర్ ఖాన్ వైపు తిరిగి గుంపుకు వెనుక నిలబడమని సైగచేసి గొంతు సవరించుకొన్నాను.

"దయచేసి జాగ్రత్తగా వినండి! నేను చెప్పే విషయం మీద మనం బ్రతికుండడం ఆధారపడి వుంది. మీలో ఎవరికైనా ఈ ఎడారిలో మీ విమానం ఎలా కూలిపోయిందో తెలుసా?"___

ఎవ్వరూ మాట్లాడలేదు. గదిలో ఒక్కసారి నిశ్శబ్దం ఆవరించింది.

"రైట్! బహుశా మీకు తెలియదు. మీ విమానం దారితప్పి ఇక్కడ కూలిపోలేదు. ఎవరో బలవంతాన ఈ ఎడారి మధ్యలో ఆ విమానాన్ని దింపించారు. హై

జాకింగ్! ఎవరు చేశారో, ఎందుకు చేశారో నామటుకు నాకు తెలియదు. కాని ఆ హైజాక్ చేసిన వాళ్లుమాత్రం మీలోనే వున్నారు. అంతేకాదు విమానం సిబ్బంది మీతో చెప్పినట్లు 'లాండింగ్ షాక్' వల్ల చనిపోలేదు. ఎవరో వాళ్ళను హత్య చేశారు. బ్రతికుంటే తమను గుర్తు పడతారని చంపేశారు. తిరిగి ఈ రోజు మేము విమానం దగ్గరకు వెళ్ళగానే, మా వెనకే వచ్చి ఫ్యూయల్ టాంక్స్ అంటించారు. వాళ్ళే మన ట్రాన్స్మిటర్‌ను కూడా టేబిల్ మీదనుండి క్రిందకు తోసి పగలగొట్టారు.

"నౌ! మైడియర్ ఫ్రెండ్స్! ఇవి జరిగిన విషయాలు. మొదటి రోజు పైలెట్ ఆఫీసర్ను, కెప్టెన్ హత్య చేయబడినప్పుడు మిమ్మల్ని అనవసరంగా కలవరపెట్టడం ఇష్టంలేక, మనకు సహాయం వస్తుందనే ఆశతో చెప్పలేదు. కాని ఇంత జరిగింతరువాత మీకు తెలుపకపోవడం బాధ్యతారహితంగా తోచింది. సో వాచవుట్! మీ పది ముగ్గురిలోనే హంతకులున్నారనేది నిస్సందేహం"

అన్నాను ఒక్కొక్కమాటే వత్తిపలుకుతూ.

అందరూ భయభయంగా ఒకరినొకరు చూసుకున్నారు.

"మిష్టర్ సురేష్! దిసీజ్ టూమచ్! అర్ యూ సీరియస్..."...బల్‌వంత్ మెహ్రా కంఠం ప్రాణభయంతో వణుకుతోంది.

"యస్ మిష్టర్ మెహ్రా! ఐయామ్ క్వయిట్ సీరియస్! పైలట్ ఆఫీసర్ల కణతల్లో పిస్తోలుగుళ్ళు చేసిన రంధ్రాలు, గొంతు నులిమి చంపబడ్డ ఏర్‌హోస్టెస్‌ను నేను మిమ్మల్ని రెస్క్యూ చేస్తున్నప్పుడే చూశాను."

"ఐ కాంట్ బిలీవ్... యూ మస్ట్ బి డ్రీమింగ్..." అంది కామినీసర్కార్ ఊపిరి పీల్చలేనట్లు.

నే నావిడ వైపు అసహనంగా చూశాను. "డోంట్

టాక్ రబ్బిష్ మిస్. సర్కార్! యూ జస్ట్ వాచవుట్! మీలో అమాయకుడైన ప్రతి వ్యక్తీ ప్రాణాపాయంలో వున్నారని గుర్తుంచుకోండి" అన్నాను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"బట్ మిస్టర్ సురేష్! మనం ఇక్కడినుండి బయట పడేదెలా?" అన్నాడు చంచల్ బోస్.

"యూ వెయిట్ అంటిల్ మార్నింగ్! ఉదయాన్నే అందరం శ్రీమోహన్ ఘర్ కు బయల్దేరే ఏర్పాటుచేస్తాను" అందరి ముఖాలు చూస్తూ అన్నాను.

వాళ్ళు నమ్మలేనట్లుగా నన్ను చూశారు.

"ఎలా? ఈ ఎడారిలో నడిచి వెళ్ళడం సాధ్యపడు తుందా?" అడిగాడు చార్లెస్ ఫ్రెరిరా.

"వుయ్ విల్ సీ" అన్నాను నాలో నేను నవ్వు కొంటూ.

మేము సురక్షితంగా మానవ ప్రపంచంలోకి వెళ్ళ డానికి వున్న ఆఖరి అవకాశం ఏమిటో ఇప్పుడే చెప్పి దాన్ని కూడా పోగొట్టుకో దలచుకోలేదు.

గదిలో అందరూ తలో మూల కూర్చొని ఒకరినొకరు చూసుకొంటున్నారు. అప్పుడే 'వాచ్ డాగ్' డ్యూటీ ప్రారంభించారన్నమాట.

నా ఎత్తు పనిచేసినందుకు కొంత ఆనందం కలిగింది. ఇలా ఒకరినొకరు అనుమానంతో ప్రతిక్షణం కనిపెట్టడం వలన హంతకుడు సడన్ గా ఏమీ చెయ్యలేడు.

10

మర్నాడు ఉదయానికి తుఫాను తగ్గుముఖం పట్టింది. గాలి ఉధృతం చాలావరకూ తగ్గిపోయింది. అప్పు డప్పుడూ వున్నట్టుండి వచ్చే గాలి తెర తప్ప వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఆరు గంటలకే సూర్యుడు ఎర్రటి కిరణాల్ని ప్రసారం చేస్తూ తూర్పున ఉదయించాడు. దూరాన నల్లగా మసి బారి ముక్కలైన విమాన శిధిలాలు కనిపిస్తున్నాయి.

వెంటనే శ్రీ మోహన్ ఘర్ కు ప్రయాణమైతే బహుశా పన్నెండు గంటలకల్లా అక్కడకు చేరుకోవచ్చు.

నేను అందర్నీ ప్రయాణానికి సిద్ధం కమ్మని చెప్పి బారెక్స్ ప్రక్కకు నడిచాను.

బారెక్స్ వెనుక చిన్న వెహికల్ షెడ్ వుంది.

ఎడారిలో కాలినడకన తిరగకుండా మేము వుపయోగించే ట్రక్ వుంది అందులో. "డెసర్ట్ రోవర్ ట్రక్"— త్రీటన్నర్. ఎడారిలో కూరుకొని పోకుండా నడవడానికి వీలుగా, యుద్ధంలో వుపయోగించే టాంక్ మాదిరి, అది 'చైన్' సహాయంతో నడుస్తుంది. కంపాస్, వాటర్ కూలింగ్ మిషను మొదలయినవన్నీ అందులో అమర్చి వుంటాయి.

సాధారణంగా ఎడారిలో బరువైన వస్తువుల్ని ఒక చోటనుండి మరో చోటకు తీసుకెళ్ళడానికి దాన్ని వుపయోగిస్తుంటాము. ఇప్పుడు మా బ్రతుకులు అది పని చేయడంమీద ఆధారపడివుంది.

దీనిగురించి ముందే తెలిసి వుంటే హంతకులు మమ్మల్ని చంపడానికి వెనుకాడేవాళ్ళుకాదు. డ్రైవర్ సీట్లో కూర్చొని ఇంజన్ స్టార్ట్ చేశాను. నక్కని కండిషన్లో వున్నట్లు శబ్దం వింటే తెలుస్తోంది.

టాంకునిండా పెట్రోలు పోసి బారెక్స్ ముందుకు తెచ్చి ఆపాను. బోనెట్ తెరిచి స్టార్టర్ ప్లగ్ పీకి జేబులో వేసుకొని లోపలకు నడిచాను.

అందరూ బధకంగావున్నారు. డాక్టర్ ఘోష్ ఓ పెద్ద చెక్కపెట్టెనిండా అపరేటస్, మందులు, బాండేజెస్

సర్దుతున్నాడు.

షేర్ఖాన్ చిన్న కిరోసిన్ స్టవ్, టీఆకు, పంచదార, కండెన్స్డ్ మిల్క్ తీసుకెళ్ళి ట్రక్కులో పెట్టాడు. నేను అందరివంకా ఓసారి చూసి తృప్తిగా తలాడించాను.

హంతకులు ఏమన్నా చేస్తే ఇప్పుడే చెయ్యడానికి ప్రయత్నిస్తారు.

"నా ఫ్రెండ్స్! దయచేసి ఎవరూ సడెన్‌గా కదలడంగాని, పరిగెత్తడంగాని చెయ్యకండి. దయచేసి అందరూ ఒకరివెంట ఒకరు మెల్లిగా వెళ్ళి ట్రక్‌లో కూర్చోండి" అన్నాను జాగ్రత్తగా చూస్తూ...

"ట్రక్! మైగాడ్! వేర్ డిహెల్"ఆశ్చర్యంగా అంటున్నాడు సుశీల్‌కుమార్.

నేను అవునన్నట్లు తలాడించాను.

ఒక్కొక్కరే వరసగా వెళ్ళి ట్రక్ వెనక బాడీలో కూర్చున్నారు. డాక్టర్ ఘోష్ కూడా వెనకే కూర్చున్నాడు.

షేర్ఖాన్ ఓ టార్పాలిన్‌ని పైన గూడులా ఏర్పాటు చేశాడు.

ఇదంతా జరుగుతున్నంతసేపు నేను ఊపిరి బిగబట్టినట్లు చూస్తూ నిలుచున్నాను ఏ క్షణాన హంతకులు కదుల్తారోనని.

"ఫ్రెండ్స్! నా వుయ్‌గో!" అన్నాను డ్రైవింగ్ సీట్లో కూర్చుని తలుపు మూస్తూ.

ఎవ్వరూ కదిలిన శబ్దంలేదు. అప్పుడప్పుడూ వీస్తున్న గాలి శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

మెల్లిగా స్టార్టర్ ప్లగ్ పీకించి ఇంజన్ స్టార్ట్ చేశాను. ట్రక్ కదలగానే షేర్ఖాన్ కాబిన్‌లోకి ఎక్కి నా ప్రక్కనే కూర్చున్నాడు.

నేను చకచక గేర్లు మార్చి ట్రక్‌ని ముందుకు పోనిచ్చాను.

దాదాపు పన్నెండు మైళ్ళు ప్రయాణం చేశాము. మరో నాలుగుగంటలు గనక ఏ ఇబ్బంది లేకుండా గడిస్తే మనుష్య ప్రపంచంలో పడతాము.

ఉదయం ఎనిమిదింటికే ఎండ తీక్షణత ఎక్కువ యింది. మబ్బుల్లేని ఆకాశం స్వచ్ఛంగా కనిపిస్తోంది.

డ్రైవింగ్ చేస్తూనే అప్పుడప్పుడూ బయిట ఆకాశం కేసి చూస్తున్నాను. వాతావరణం బావుంది కాబట్టి జోధ్‌పూర్‌నుండి రావలసిన సప్లయిస్ విమానం రావచ్చు.

వెనక కాబిన్ మీద ఎవరో బలంగా కొడుతూ చప్పుడు చేస్తున్నారు.

ఏమిటన్నట్లు షేర్‌ఖాన్ వైపు చూశాను. షేర్‌ఖాన్ కాబిన్ వెనకవున్న చిన్న కిటికీలాంటిది తెరచి వెనక బాడీలోకి చూశాడు. తలుపు తెరవగానే అవతల ఫెర్రిరా కంఠం వినిపించింది.

"స్టాప్ ది ట్రక్! షి యీజ్ గెటింగ్ పెయిన్స్" అరిచాడతను.

"షి యీజ్ వాట్?" అంటూండగానే విషయం అర్థమయింది నాకు.

మై బాడ్ లక్! మిసెస్ లాల్‌కు నెప్పులు ప్రారంభ మయినాయి. ఈ ఇసుక ఎడారిలో మరో ప్రాణి ప్రపంచంలోకి వచ్చే ప్రయత్నం ప్రారంభించింది.

షేర్‌ఖాన్ ట్రక్ బాడీలోకి తొంగిచూసి, నావైపు తిరిగి తలాడించాడు.

ట్రక్కు ఆపేశాను.

షేర్‌ఖాన్ భుజంమీదనుండి ట్రక్ బాడీలోకి తొంగి చూశాను. మిసెస్ మున్నీలాల్ బాధతో మెలికలు

తిరుగుతోంది. డాక్టర్ ఘోష్ ఆవిడ నాడి చూస్తూ ఏదో చెపుతున్నాడు. మిసెస్ లాల్ ముఖంమీద స్వేదబిందువులు ధారకడుతోన్నయ్.

ట్రక్ దిగి వెనకకు వెళ్ళాము. డాక్టర్ ఘోష్ అందర్నీ క్రిందకు దిగమని చెపుతున్నాడు. మమ్మల్ని చూడగానే నెర్వస్ గా నవ్వాడు.

అందరూ చకచకా ట్రక్ లోంచి క్రిందకుదిగారు.

అందరూ క్రిందకు దిగగానే డాక్టర్ ఘోష్ తన చెక్క పెట్టె తెరచి రెండు దుప్పట్లు ట్రక్ నేలమీద పరచి మిసెస్ లాల్ ను దానిమీద పడుకోబెట్టాడు.

ఆవిడను పరీక్ష చేసి షేర్ ఖాన్ వైపు తిరిగి, "ఆపరేట్ చెయ్యాల్సిన అవుసరం వుంటుందనుకొంటాను. స్టౌ వెలిగించి నీళ్లు వేడిచెయ్యి" అన్నాడు.

షేర్ ఖాన్ వెంటనే స్టౌ వెలిగించి, టీ కాచడానికి తెచ్చిన పెద్దగిన్నెలో, ప్లాస్టిక్ కేన్ లోనుండి నీళ్ళు వంపి కాచడం మొదలెట్టాడు.

చున్నీలాల్ చిన్నపిల్లాడిలా గడగడలాడుతున్నాడు. డాక్టర్ ఘోష్, కామినీ సర్కార్ వైపు తిరిగి దగ్గరకు రమ్మని సైగచేశాడు.

"ప్లీజ్ హెల్ప్ మి మిస్!" అన్నాడు ఆపరేషన్ కు బాడీ అనుకూలంగా వచ్చేట్లు దుప్పట్లు ఎలా ఎత్తుగా పెట్టాలో చెపుతూ.

ఎ డాక్టర్ యీజ్ ఆల్ వేస్ ఎ డాక్టర్ అనిపించింది.

పొరపాటున పెద్దగా గాలివీస్తే ఇసుకపడకుండా, పైన వేసిన టార్పాలిన్ ను సందులేకుండా కట్టమని పురమాయించాడు నాకు.

ఓ పదినిముషాలు అందరమూ ట్రక్ బాడీని చిన్నసైజు ఆపరేషన్ థియేటర్ గా మార్చడంలో మునిగిపోయాం.

బోస్, చాంద్ సింగ్ నాకు చుట్టూ స్పేర్ బ్లాంకెట్స్ తెరలుగా కట్టడంలో సహాయం చేశారు.

మిస్ కామిని నీటిలో తెల్లని టవల్ తడిపి మిసెస్ లాల్ ఒళ్ళంతా తుడుస్తోంది.

డాక్టర్ ఘోష్ సిజర్స్, కత్తులు, ఫోర్ సిప్స్, స్టెరిలైజ్ చేస్తున్నాడు.

చున్నీలాల్ క్రిందకురిగి ట్రక్కుకు ఆనుకొని ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకొంటున్నాడు.

టైము చూసుకొన్నాను. ఎనిమిదిన్నర కావస్తోంది.

ట్రక్ లో వున్నవాళ్లు తప్ప మిగిలినవాళ్లు రెండుమూడు గుంపులుగా కూర్చొని మాట్లాడుకొంటున్నారు.

నేను ట్రక్ బాడీ నీడలో ఇసుకలో కూలబడ్డాను. మిసెస్ లాల్ మూలుగులు వినిపించడంలేదు. బహుశా ఎనెస్తీషియా ఇచ్చివుండాలి. పి. యస్. రావు నా దగ్గరికి వచ్చి ప్రక్కనే కూలబడ్డాడు.

"మిస్టర్ సురేష్! ఆపరేషన్ సక్సెస్ అయినా మనం వెంటనే ఇక్కడినుండి కదల్లానికి వీలవదనుకొంటాను" అన్నాడు నర్వస్ గా నావైపు చూస్తూ.

నిజమే! ఆ విషయం అంతవరకూ తట్టలేదు నాకు.

అప్పుడే మేజర్ ఆపరేషన్ చేసిన మనిషిని ఆ ట్రక్కులో తీసుకెళ్ళడం ప్రమాదం. ట్రక్ కదలికకు శరీరంలో భాగాలన్నీ కదలి వేసినకుట్లు విడిపోయే ప్రమాదంవుంది. అవునన్నట్లు తలవూపాను.

"మరి ఏం చేద్దామని అనుకొంటున్నారు?" నా ముఖాన్నే పరీక్షగా చూస్తూ అడిగాడు.

నేను చిత్రంగా భుజాలెగురేశాను. "కొంతమంది వెనక్కి వుండిపోవాలనుకుంటాను, ముందు మేము వెళ్ళి సహాయం తెచ్చేవరకు" చెప్పాను.

అంతలో ఏదో చప్పుడు వినిపించింది. గిరగిర తిరిగే బ్లేడ్స్ గాలిని కోస్తున్న చప్పుడు. హెలికాప్టర్ ఎగురుతున్నప్పుడు వినబడే శబ్దం.

చటుక్కున లేచి నిలబడి శబ్దం వస్తున్న వైపు ఆకాశంలోకి చూశాను.

పడమటి దిక్కునుండి ఓ హెలీకాప్టర్ గజేంద్రుణ్ణి రక్షించే విష్ణుమూర్తి వాహనంలా మావైపు వస్తోంది.

చిట్టచివరికి దేవుడు మా ప్రార్థన విన్నట్లున్నాడు. విమానం కాలిపోయే ముందు మేం ప్రసారం చేసిన మెసేజ్ అధికారులకు అందినట్లుంది. ఆనందంతో ఎగురుతూ గంతులు వేయాలనిపించింది.

11

అందరూ ఒక్క ఉదుటున లేచి క్రిందకు దిగుతోన్న హెలీకాప్టర్ వైపు పరుగు పెట్టారు.

యఫ్. హెచ్. 1100 యుటిలిటీ హెలీకాప్టర్ అది. క్రిందకు దిగుతోన్న హెలీకాప్టర్ మీద 'పి. ఎ.' అన్న అక్షరాలుచూసి పరిగెత్తే వాణ్ణలా చటుక్కున ఆగిపోయాను.

'పి. ఎ' అన్న మాటలకు పాకిస్థాన్ ఆర్మీ అని అర్థం. ఒక్కసారి గుండె ఝల్లుమంది.

నా కళ్ళను నమ్మలేనట్లు అటే చూస్తూ వుండిపోయాను.

అందరూ ట్రక్కుకు కాస్త దూరంలో భూమికి పదడుగుల ఎత్తులో గాలిలో అటూ ఇటూ వూగుతూ క్రిందకు దిగుతోన్న హెలీకాప్టర్ను చూసి ఆనందంతో కేకలు వేస్తున్నారు. హెలీకాప్టర్ బ్లేడ్స్ ప్రొపల్షన్ వల్ల ఇసుక దుమారంలా లేస్తోంది.

ఢాం!!! పిస్తోలు పేలిన శబ్దం!

హెలీకాప్టర్ క్రిందకు దిగగానే వినబడిన శబ్దానికి అందరూ అరుపులు ఆపి ఒక్క క్షణం తలలు త్రిప్పి వెనక్కి తిరిగారు.

చాంద్ సింగ్ చేతిలో పిస్తోలు జనంమీదకు గురిపెట్టబడి వుంది. అతని ప్రక్కనే చార్లెస్ ఫెర్రిరా నవ్వుతూ నిలబడివున్నాడు. ఇద్దరి మెడలచుట్టూ నల్లని మఫ్లర్లు వేలాడుతూన్నయ్.

అందరూ మంత్రించబడిన మనుషులకుమల్లే వాళ్ళిద్దరి వంకా చూస్తూ వుండిపోయారు. వాళ్ళకు మాకు మధ్య కనీసం ఆరేడు గజాలైనా దూరం వుంటుంది.

సో! దీసార్ ది మర్డరర్స్! వీళ్లేనన్నమాట హంతకులు! దేనికీ దౌర్జన్యం?

"డోన్ట్ మూవ్ మైడియర్ ఫ్రెండ్స్! ఎవరైనా పిచ్చి ప్రయత్నాలుచేస్తే కాల్చి చంపడానికి వెనుకాడనని మరచిపోకండి."

చాంద్ సింగ్ కంఠంలో కరుకుదనానికి ఒక్క క్షణం ఒళ్లు జలదరించింది.

వెనక హెలీకాప్టర్ తలుపు తెరచిన చప్పుడయింది.

"కవర్ దెమ్!" అన్నాడు ఫెర్రిరా ఎవరినో ఉద్దేశించి. ఎవరో తుపాకిబోల్టు తెరచిమూసిన శబ్దమయింది.

మెల్లిగా తలత్రిప్పి వెనక్కి చూశాను. ఖాకీ యూనిఫారమ్‌లోవున్న ఇద్దరు వ్యక్తులు సబ్ మెషిన్ పిస్టల్స్ మామీద గురిచేసి నిలబడివున్నారు.

తలమీద టోపీలు, భుజాలమీద ఏరకమైన గుర్తులు లేకపోయినా, వాళ్లు పాక్ ఆర్మీకి చెందిన వాళ్ళని చెప్ప డానికి ఆ ఖాకీ యూనిఫామ్ చాలు.

తలత్రిప్పి మళ్ళీ చాంద్ సింగ్ వంక చూశాను. ఈ

హఠాత్ సంఘటనకు బుర్ర పనిచెయ్యడం మానేసింది.

"వాడిచేతిలో పిస్తోలు సర్వీస్ పిస్తోలు. బహుశా పైలట్ దగ్గరనుండి లాక్కొని వుంటాడు" అన్నాడు రావ్ పెదిమల చివరినుండి.

చాంద్ సింగ్ మా అందరివంకా నవ్వుతూ చూశాడు. అతని కళ్ళుమాత్రం నల్లరాతి ముక్కల్లా అతికఠినంగా కనిపిస్తోన్నాయ్.

"దయచేసి అందరూ వరసగా నిలబడండి" చాంద్ సింగ్ గొంతు మిలటరీ ఆఫీసరు గొంతులావుంది.

"వాటీస్ దిస్ నాన్ సెన్స్ మిష్టర్ సింగ్" అంటున్నాడు మెహ్రా.

"షటప్! డూ వాట్ ఐ సే!" అరిచాడు చాంద్ సింగ్.

అందరూ అతని పిస్తోలువంకే భయంగా చూస్తూ వరసగా ఒకరిప్రక్క ఒకరు నిలబడ్డారు. చాంద్ సింగ్ మావంక ఓసారిచూసి తలాడించాడు. నాకు అంతా అయోమయంగా వుంది.

"వెరీగుడ్! ఇప్పుడు అసలు విషయానికొద్దాం. ఓ. యస్. ఫార్ములా కాగితాలు మీలో ఎవరిదగ్గరున్నాయ్?" అన్నాడు అందరివంకా పరీక్షగా చూస్తూ.

అందరూ గుడ్లప్పగించి వాళ్ళవేపే చూస్తున్నారు. దట్సిట్. ఓ. యస్. ఫార్ములా కాగితాలకోసం ప్లేన్ను హైజాక్ చేసారన్న మాట. అంటే ఇక్కడవున్న తొమ్మిదిమంది ప్రయాణీకుల్లో ఎవరిదగ్గరో ఆ ఫార్ములా కాగితాలున్నాయి. ఏమిటా ఓ. యస్. ఫార్ములా?

చాంద్ సింగ్ వైపే చూస్తున్న నేను ఒక్క క్షణం నిలుచున్న పాటునే బిగుసుకుపోయాను.

ట్రక్కు లోపల డాక్టర్ ఘోష్, కామినీలతో పాటు షేర్ ఖాన్ కూడా వున్నాడు. ట్రక్కు మాకు మధ్య

చాంద్ సింగ్, ఫ్రెరిరాలు నిలబడివున్నారు.

ట్రక్కు కట్టిన టార్పాలిన్ మధ్యనుండి చాంద్ సింగ్ మీదకు దూకపోతున్న షేర్‌ఖాన్‌ను చూడగానే ఒక్క క్షణం గుండె కొట్టుకోడం మానేసింది.

ఫ్రెరిరా నా చూపు గమనించి వుండాలి. తలత్రిప్పి చూసి ఒక్కసారి అర్చాడు.

"వాచవుట్ దేశాయ్!"

చాంద్ సింగ్ మెరుపులా వెనక్కు తిరిగి పిస్తోలు పేల్చాడు.

ట్రక్‌లోనుండి మీదికి దూకబోతున్న షేర్‌ఖాన్ చిన్నగా అరచి దబ్బున యిసుకలో పడిపోయాడు. అతని తొడమీద బుల్లెట్ చేసిన గాయంలోనుండి రక్తం రివ్వున చిమ్మింది.

"టేక్ కేరాఫ్ హిమ్ జైస్వాల్!" అన్నాడు క్రూరంగా నవ్వుతూ మావైపు తిరిగి.

వీళ్ళ అసలు పేర్లు చాంద్‌సింగ్, చార్లెస్ ఫ్రెరిరాలు కావన్నమాట. చాంద్ సింగ్ పేరు దేశాయ్ అని, ఫ్రెరిరా పేరు జైస్వాల్ అని వాళ్లు పిల్చుకున్న దాన్నిబట్టి అప్పా డర్థమయింది.

జైస్వాల్ షేర్‌ఖాన్‌ను యీడ్చుకొచ్చి మాముందు పారేశాడు. మిస్. కామినినికూడా వరసలో నిలబెట్టాడు. ఎందుకో డాక్టర్ ఖా॰మ్‌ను మాత్రం తీసుకురాలేదు.

"నౌ, టెల్ మి! ఫార్ములా ఎవరి దగ్గర వుంది. ఆ ఫార్ములా ఇచ్చేస్తే ఎవరిదార్న వాళ్లు వెళ్ళిపోవచ్చు మీకు తొందర్లో ఎవరినించి సహాయం వచ్చేదారిలేదు. చెప్పకపోతే అందర్నీ వరసపెట్టి కాల్చి చంపేస్తాను.'.

దేశాయ్ కంఠంలో కఠినత్వం ఎలాంటి ధైర్యవంతుడి కైనా వణుకు పుట్టిస్తుంది.

ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా రాక్షసుళ్ళై నిలబడ్డ ఆ దుండగులవంకే గుడ్లప్పగించి చూస్తున్నారు.

"ఆల్ రైట్! ఒక్క నిమిషం టైమిస్తున్నాను. ఆలోగా ఆ ఫార్ములా బయట పడకపోతే కుడిప్రక్క నుండి మొదటివ్యక్తి కాలులో ఈ పిస్తోలు గుండు వుంటుంది" అరిచాడు దేశాయ్.

అందరం అప్రయత్నంగా కుడిప్రక్కకు చూశాము. అందరికంటూ చివర అబ్దుల్ గఫూర్ నిలబడి వున్నాడు. గఫూర్ ముఖంమీద చెమట ధారలుగా కారుతోంది.

దేశాయ్ చేతిగడియారంవైపు తీక్షణంగా చూస్తూ నిలబడ్డాడు. చకచకా సెకన్లు దొర్లిపోతున్నాయ్.

ఎటూ పారిపోయే అవకాశంలేదు. ఈ ఎడారిలో ఎటూ తప్పించుకుపోలేము. అందరూ ఊపిరి బిగబట్టి వాళ్ళిద్దర్నీ చూస్తున్నారు.

హఠాత్తుగా దేశాయ్ పిస్తోలు గఫూర్ వైపు గురి పెట్టాడు.

"ఒన్ మినిట్ యీజ్ ఓవర్!"

ఎవ్వరూ మాట్లాడలేదు. మరుక్షణం పిస్తోలు పేల్చిన శబ్దం చెవులు చిల్లులుపడేలా చేసింది.

అబ్దుల్ గఫూర్ పెద్దగా కేక పెట్టి నిలబడ్డచోట కూల బడిపోయాడు.

గుండెల్లో బాధ, అసహాయతా, కోపం సుళ్లు తిరగ సాగాయి.

"యూ హార్ట్‌లెస్ బాస్టర్డ్! స్టాపిట్!! ఫర్ గాడ్స్ సేక్ స్టాపిట్!" అరిచాను పిచ్చాళ్ళా.

దేశాయ్ క్రూరంగా నవ్వాడు. "గో సురేష్! ఆ కాగితాలు ఇచ్చెయ్యమని వాళ్ళకు చెప్పు. అప్పుడు అందరికీ ఈ బాధ తప్పుతుంది. లేకపోతే అందర్నీ వరుసగా

చిత్రవధ చేస్తాను."

"ఆల్ గ్రైట్ ఏమిటా ఫార్ములా?" అడిగాను.

గుండు దెబ్బతిన్న షేర్ ఖాన్ మూలుగుతున్నాడు. అబ్దుల్ గఫార్ కు స్పృహపోయినట్లుంది షాక్ వల్ల.

"ఓ.. యస్. ఫార్ములా కాగితాలు. సబ్స్టిట్యూట్ ఫార్ములా. పెట్రోలుకు బదులు ఇంధనంగా వాడ్డానికి చవగ్గా తయారుచేయగల రసాయనం ఫార్ములా. ఈ విమానంలో ప్రయాణంచేస్తున్న వాళ్ళలో ఒకరిదగ్గర వున్నట్లు మాకు తెలిసింది. ఆ రసాయనాన్ని ఓ ఇండియన్ సైంటిస్ట్ కనుక్కొన్నాడు. ఆ ఫార్ములాని విమానంలో బొంబాయి దగ్గర టెక్నికల్ లాబ్ కు పంపుతున్నట్లు తెలిసింది. ప్రయాణీకుల్లో ఎవరో ఒకరు ఆ ఫార్ములా తీసుకెళుతున్నారు. త్వరగా ఆ కాగితాలు మాకిస్తే మీకు, మాకు శ్రమతగ్గుతుంది."

మైగాడ్! పెట్రోలుకు బదులుగా ఇంధనంగా వుపయోగపడే కెమికల్! ఈ సైంటిఫిక్ డిస్కవరీగాని బయటపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే గొప్ప మార్పు వస్తుంది.

"అయితే ఈ ఎడారిలో విమానాన్ని ఎందుకు దింపారు?" పి. యస్. రావు కంఠంలో జిల్లా అధికారి వుండాల్సిన హోదా లేదు.

"జస్ట్ అవర్ బేడ్ లక్! విమానాన్ని హైజాక్ చేసి బార్డర్ అవతల పాకిస్తాన్ లో దింపి, మా పని పూర్తి చేసుకోవాలని మా ప్లాను. కాని హైజాక్ చేసిం తరువాత మధ్యలో ఈ ఇసుక తుఫాను అడ్డొచ్చింది. ఇసుక ఇంజన్లలో దూరి ఇంజన్ పాడయింది. బోర్డర్ దాటి అవతలకు వెళ్ళే అవకాశం లేదు. అంచేత ఈ ఎడారిలో తప్పనిసరిగా లాండింగ్ చేశాను."

"చేశాను అంటున్నావు?"

"అవును నేనే లాండింగ్ చేశాను. పైలెట్లను బెదిరించడానికి మా దగ్గర ఆయుధాలు లేవు. అంచేత వాళ్ళకు కూడా స్పృహ పోగొట్టి, విమానం కంట్రోల్ లోకి తీసుకొన్నాము. కాని భారత భూభాగంలో దిగిన తరువాత వాళ్ళు బ్రతికుండడం మాకు ప్రమాదం. స్పృహ పోగొట్టేముందు వాళ్ళు మమ్మల్ని చూశారు. అలాగే ఎయిర్ హోస్టెస్ కూడా, అందరికన్నా ముందు స్పృహలోకి వచ్చి మమ్మల్ని చూసింది."

అందరూ చెవులప్పగించి వింటూ వుండిపోయారు.

"మేట్! ఆలస్యం అయిపోయింది" అరిచాడు హెలికాప్టర్ పైలెట్.

"రైటో! ఇక ఆ ఫార్ములా ఇస్తే మా దారిన మేం పోతాం ... లేకపోతే ఈ సారి మరొకరి గుండెల్లో బుల్లెట్ దూరుతుంది" అన్నాడు పిస్తోలు పైకెత్తి గురిపెడుతూ.

దేశాయ్ అన్నంత పనీ చేస్తాడనడంలో సందేహం లేదు.

"కాంట్ యుసీ రీజన్!" అరిచాను... "మనుషుల ప్రాణాలకన్నా మీకు ఫార్ములా ఎక్కువా? దయ చేసి ఆ ఫార్ములా వాళ్ళకిచ్చేయండి."

ఎవ్వరూ మాట్లాడలేదు.

"డామ్ యువర్ ఇంటిలిజన్స్! సీక్రెట్స్ లీక్ కాకుండా చూసుకోవాలి. ఈ స్థితికి వచ్చాక మీ గురించి అందరి ప్రాణాలు పోగొట్టడం అవివేకం. ఎవరి దగ్గర వున్నాయో దయచేసి ఇచ్చెయ్యండి" అరిచాడు చంచల్ బోస్.

ఒక్కొక్కళ్ళని వెతికి ఎందుకు తీసుకోవడంలేదో అర్థంకాలేదు నాకు. బహుశా మామూలుగా గుర్తుపట్ట

డానికి వీల్లేకుండా వుండివుండాలి ఆ ఫార్ములా.

ఆ ఫార్ములా దాస్తున్న వ్యక్తి స్థితి అర్థం చేసుకోగలను. కర్తవ్యానికి, మానవత్వానికి అతని మనసులో జరుగుతోన్న సంఘర్షణ వూహించుకోగలను.

మిస్. కామినీ సర్కార్ మీదకు పిస్తోలు గురి చేసి ట్రిగర్ మీద వేలు పెట్టాడు దేశాయ్.

"ఆల్ రైట్! ఇస్తాను!" అన్నారెవరో.

అందరూ అటు చూశారు.

గోపాల్ సంధు ఒకడుగు ముందుకు వేసి నిలబడ్డాడు.

అది వరకెప్పుడు సీక్రెట్ ఏజంటును చూడలేదు నేను. ఇంత సామాన్యంగా వుంటాడా అనిపించింది. ఒక్క క్షణం రిలీఫ్‌గా ఊపిరి పీల్చాను.

దేశాయ్ పిస్తోలును గోపాల్ మీదకు గురిపెట్టాడు.

"గుడ్! ఇలా ఇవ్వు!"

గోపాల్ సంధు జేబులోంచి మెల్లిగా మనీపర్సుతీశాడు. తెరచి ఓ పదిరూపాయల కట్ట దేశాయ్ కాళ్ళ ముందు పడేలా విసిరేశాడు. ఓ పదో, ఇరవయ్యో నోట్లుండొచ్చు.

"వాటీజ్ దిస్?" అన్నాడు దేశాయ్ నోట్ల వంక నొసలు చిట్లించి చూస్తూ.

"నోట్లమధ్య తెల్లని భాగంలో 'ఇన్ విసిబుల్ ఇంక్'లో వ్రాసి వుంది ఫార్ములా. లైటర్‌తో వేడి చేయి అక్షరాలు కనిపిస్తాయి."

దేశాయ్, ఫెర్రిరాకు సైగచేశాడు. ఫెర్రిరా లైటర్ తీసి ఒక నోటును వేడిచేశాడు. నోటులో తెల్లని భాగం మీద చిన్నచిన్న అంకెలు, గుర్తులు కనిపించసాగినయ్.

దేశాయ్ నవ్వి తలవూపి "థాంక్స్ ఫ్రెండ్" అన్నాడు ఒక్కొక్క అడుగే జాగ్రత్తగా హెలీకాప్టర్ వైపు వేస్తూ.

వెళ్ళే ముందు ఎవరైనా అడ్డుపడతారని జాగ్రత్త పడుతున్నాడన్నమాట. అందరూ ట్రక్ ప్రక్కనే గుంపుగా కూర్చున్నాం.

ట్రక్ లోపల డాక్టర్ ఘోష్ ఒక్కడే ఆపరేషన్ చేస్తున్నాడని తెలుసు. మిసెస్ లాల్ బలంగా శ్వాస పీలుస్తున్న చప్పుడు వినిపిస్తోంది.

మనసులోనే డాక్టర్ ఘోష్‌కు నమస్కారం చేశాను. ఒక ప్రక్క ప్రాణాలు పోతోంటే మరో ప్రక్క క్రొత్త ప్రాణిని బయటికి తెచ్చే ప్రయత్నంలో అచంచలంగా మునిగిపోయాడు డాక్టర్ ఘోష్. అంచేత డాక్టర్ ఘోష్‌ను బయటికి లాగలేదేమో వాళ్లు.

12

జైస్వాల్, దేశాయ్, ఇద్దరూ హెలికాప్టర్ లోకి ఎక్కి కూర్చున్నారు.

దేశాయ్ బయటికి వంగి ఖాకీ యూనిఫాం మనుషులకు ఏదో చెప్పాడు. వాళ్ళు తల వూపి మిషిన్ పిస్టల్స్ మా వైపు తిప్పారు.

మై గాడ్! పనిపూర్తయిం తరువాత నిర్దాక్షిణ్యంగా అందర్నీ చంపేస్తున్నాడు దేశాయ్.

"వాచవుట్! వాళ్లు ఫైర్ చేస్తున్నారు!" అన్నాను ఎగిరి నిలబడి ట్రక్కు వెనక్కి పరిగెడుతూ...

టపటప మెషిన్ పిస్టల్ ప్రేలిన శబ్దం వినిపించింది. గుంపుగా వున్న అందరూ చెల్లాచెదరయ్యారు. ఎవరో గట్టిగా అరచిన శబ్దం...

కామినీసర్కార్, విసూ చక్రవర్తి ట్రక్ వెనకాలకు పరిగెత్తుకొచ్చారు. చంచల్ బోస్, గోపాల్ ట్రక్ క్రింద నుండి దొర్లుకొంటూ ఇవతలకొచ్చారు.

మళ్ళీ పిస్టల్ పేల్చిన శబ్దం...

పిస్తోలు శబ్దంతోపాటు ఎక్కడో దూరంగా మరో శబ్దం. మేఘం ఆగకుండా ఉరిమినట్లు వస్తోంది శబ్దం.

హెలికాప్టర్ కదులుతుందేమో ననుకొన్నాను. కాదు. క్రిందగా ఎగురుతూ వస్తున్న రెండు జట్ విమానాలు చేసే శబ్దం అది. ప్రక్కలమ్మట ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గుర్తులు కనిపిస్తున్నాయి.

జోధ్‌పూర్ స్టేషన్ వేవ్ లెంగ్తుమీద మేము రాత్రి ప్రసారంచేసిన మెసేజ్ ఎవరో శ్రోత విని మర్నాడు ప్రొద్దున్న అధికారులకు తెలియచేశాడు అని తర్వాత తెలిసింది.

ఒక్క గంటముందు అధికారులకు ఆ వార్త తెలిస్తే నాలుగు ప్రాణాలను రక్షించి వుండేవాళ్లు.

హెలికాప్టర్ హడావిడిగా పైకిలేచి పడమటి దిక్కుకు ఎగిరిపోసాగింది.

దూరంగా ఆకాశంలో ఏదో పెద్దశబ్దం వినిపించింది.

అంతే! యఫ్. హెచ్. 1100 హెలికాప్టర్ మంటల్లో మండుతూ నల్లని పొగలు చిమ్ముతూ తల్లక్రిందులుగా క్రిందకు పడిపోయింది.

ట్రక్ లోనుండి కవ్వున పసిపిల్ల ఏడ్చిన శబ్దం వినిపించింది.

సన్నని మందహాసం నా పెదిమలమీద మెరిసింది. ప్రపంచానికి మరో ప్రాణి. డాక్టర్ ఘోష్‌కు మరో విజయం. లేచి ఉత్సాహంతో ట్రక్ వెనక్కు నడిచాను.

—: ఐ పో యి ం ది :—